తీరం.. అలకల్లోలం


అలల కోతతో ఉప్పాడ గ్రామం వద్ద గురువారం పరిస్థితి

ఉప్పాడలో నేలకూలిన గృహాలు.. విద్యుత్తు స్తంభాలు

కొత్తపల్లి, న్యూస్‌టుడే: వాయుగుండం ప్రభావం కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలంలోని ఉప్పాడ తీరంపై తీవ్రంగా పడింది. రెండు రోజులుగా సముద్రం ఉగ్రరూపం దాల్చి తీర ప్రాంతవాసులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. భారీ ఎత్తున కెరటాలు గ్రామాలపై విరుచుకుపడుతున్నాయి. వీటి ప్రభావం బుధవారం అర్ధరాత్రి నుంచి మరింతగా పెరగడంతో సమీపంలోని చెట్లు, విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. ఉప్పాడ, సూరాడపేట, మాయాపట్నం, జగ్గరాజుపేట, కోనపాపపేట గ్రామాల్లో పదుల సంఖ్యలో గృహాలు కోతబారినపడి సాగర గర్భంలో కలిసిపోయాయి. పలు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. బాధితులు సామగ్రితో అద్దె ఇళ్లు, ప్రభుత్వ భవనాల్లోకి చేరారు. సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు లేవని అన్నారు. సముద్రపు ఒడ్డున ఉన్నా సరే గత ప్రభుత్వంలో తమకు ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తంచేశారు. నిరాశ్రయులైన తమను ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకొంటున్నారు. ఉప్పాడ నుంచి కాకినాడ వెళ్లే బీచ్‌రోడ్డు కెరటాల తాకిడికి ప్రమాదకరంగా మారింది. ఆ రహదారిపై ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

గురువుల ఓటుకు ముగిసిన గడువు

● ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో 2,771 దరఖాస్తులు

కొత్తగా వచ్చిన దరఖాస్తులు ఇలా:

కాకినాడ జిల్లా	387
తూర్పుగోదావరి	611
బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	609
అల్లూరి సీతారామరాజు	131
పశ్చిమగోదావరి	749
ఏలూరు	284

బాలాజీచెరువు(కాకినాడ), న్యూస్‌టుడే: ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం ఎన్నికలకు సంబంధించి ఓటు నమోదు ప్రక్రియ ముగిసింది. సెప్టెంబరు 3 వరకు కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, అల్లూరి జిల్లాల్లో కలెక్టరేట్, ఆర్డీవో, తహసీల్దారు, ఎంపీడీవో, ఎంఈవో కార్యాలయాల్లో ఫారం-19 ద్వారా ఓటుకు దరఖాస్తులు స్వీకరించారు. 14,191 మంది దరఖాస్తు చేయగా, పరిశీలించి 13,677 మందికి ఓటుహక్కు కల్పించారు. గతనెల 24న ముసాయిదా జాబితా ప్రచురించారు. అప్పటి నుంచి ఈనెల 15 వరకు అర్హుల నుంచి మరో సారి దరఖాస్తులు, ముసాయిదా జాబితాపై అభ్యంతరాల స్వీకరణ చేపట్టారు. కొత్తగా 2,771 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిపైన, ముసాయిదా జాబితాపై అభ్యంతరాలను ఈనెల 30లోగా విచారించి.. నవంబరు 6న తుది జాబితా ప్రచురిస్తారు. వచ్చే నెల లేదా, డిసెంబరులో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. గెలిచిన అభ్యర్థికి 2027 మార్చి వరకే పదవీ కాలం ఉంటుంది. 2021లో జరిగిన ఎన్నికల్లో 17వేల మందికి పైగా ఓటర్లు ఉండగా, ఈసారి తుది జాబితాలో 15వేల పైచిలుకు మాత్రమే ఉంటాయని అంచనా వేస్తున్నారు. కొత్త దరఖాస్తులు, ముసాయిదా జాబితా అభ్యంతరాలపై విచారణ పూర్తి చేసి తుదిజాబితా ప్రచురిస్తామని కాకినాడ డీఆర్వో డి.తిప్పేనాయక్ తెలిపారు.

ఏఆర్ ఏఎస్పీగా బాధ్యతల స్వీకరణ

మసీదు సెంటర్: కాకినాడ ఏఆర్ ఏఎస్పీగా బదిలీపై వచ్చిన ఎస్.శ్రీనివాసరావు గురువారం ఆయన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కాకినాడ ఏఆర్ ఏఎస్పీగా పనిచేసిన బి.సత్యనారాయణ బదిలీపై కృష్ణా జిల్లాకు వెళ్లనున్నారు. ఈ సందర్భంగా ఆయనను ఎస్పీ సత్కరించారు.


ఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏఆర్ ఏఎస్పీ శ్రీనివాసరావు

వైకాపా పాపం.. రహదారులకు శాపం


పిఠాపురం- సామర్లకోట మధ్య ఆర్‌అండ్‌బీ రహదారి దుస్థితి

- నాడు బిల్లులు చెల్లించక గుత్తేదారుల డీలా
- మరమ్మతుల పనులకు టెండర్లలో మిశ్రమ స్పందన
- కూటమి ప్రభుత్వ చొరవతో తాజాగా ఆశలు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: గత అయిదేళ్లలో వైకాపా ప్రభుత్వం గుత్తేదారులకు చుక్కలు చూపించింది. ఏ అభివృద్ధి పనులు చేసినా బిల్లులు చెల్లించకపోవడం వారికి తీవ్ర నిరాశ మిగిల్చింది. ఇది ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ఆర్‌అండ్‌బీ రహదారుల మరమ్మతు పనులపైనా ప్రభావం చూపింది. చిన్న గుత్తేదారులకు బిల్లులు ఎగ్గొట్టడంతో గుంతలు పూడ్చడానికి ఎవరూ ముందుకురాలేదు.

ఇదీ గుంతలు, మరమ్మతుల టెండర్ల పరిస్థితి

జిల్లా	ప్రతిపాదించిన పనులు	పొడవు (కి.మీ)	మంజూరైన నిధులు (రూ.కోట్లలో)
కాకినాడ	42	126	7.39
బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	71	265	17.68
తూర్పుగోదావరి	35	91	7.74

కూటమి ప్రభుత్వం కొలువుదీరాక జూన్‌లో కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లోని ఆర్‌అండ్‌బీ రహదారుల్లో గుంతలు పూడ్చడం, మరమ్మతులకు కాకినాడ సర్కిల్ ఆర్‌అండ్‌బీ కార్యాలయం ప్రతిపాదనలు పంపింది. ఆమోదం రావడంతో గతనెలాఖరున కాకినాడ, పెద్దాపురం, అమలాపురం, రాజమహేంద్రవరం డివిజన్ల పరిధిలో రూ.32.81కోట్ల విలువైన 148 పనులకు టెండర్లు ఆహ్వానించారు.. ఈనెల 15తో గడువు ముగిసింది. రూ.13.97 కోట్ల విలువైన 71 పనులకు బిడ్లు దాఖలు కాగా, రూ.18.84కోట్ల విలువైన 77 పనులకు ఒక్క టెండరూ రాలేదు. రూ.40 లక్షలకు పైబడి రూ.5 కోట్ల విలువైన 7 పనులకూ ఇదే పరిస్థితి. బిడ్లు దాఖలైనవాటికి అగ్రిమెంట్లు పూర్తి చేసి, నవంబరు మొదటి వారం నుంచి పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని ఎస్ఈ జి.కంఠ తెలిపారు. మిగతా 77 పనులకు రీ-టెండర్లు పిలుస్తామన్నారు.

కాకినాడ జిల్లాలో
ఇటీవల 42 పనులకు టెండర్లు పిలవగా.. రూ.3.69 కోట్ల విలువైన 23 పనులకు టెండర్లు వచ్చాయి. రూ.3.70 కోట్ల విలువైన 19 పనులకు ఎవరూ దాఖలు చేయలేదు.

రూ.29కోట్ల బకాయిలు: గత రెండేళ్లుగా ఉమ్మడి జిల్లాలో చేపట్టిన రహదారుల మరమ్మతు పనులకు చిన్న గుత్తేదారులకు రూ.29కోట్ల వరకు బిల్లులు రావాల్సి ఉంది. వీరంతా రూ.10 లక్షల నుంచి రూ.50లక్షల లోపు పనులు చేసిన వారే. దశలవారీగా చెల్లింపులు చేపడితే కొత్త పనులకు బిడ్లు దాఖలయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

మరో రూ.22.81 కోట్ల పనులకు ఆమోదం: ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కురిసిన వానలతో దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతులకు రూ.22.81 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపగా త్వరలో ఆమోదం రానుంది. రాష్ట్ర వ్యాప్తంగా మరమ్మతులకు రెండో విడత నిధులిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం ప్రకటించిన నేపథ్యంలో గుత్తేదారులు ముందుకు వచ్చే అవకాశముంది.

రూ.90కోట్ల బిల్లుల చెల్లింపు: ఉమ్మడి జిల్లా పరిధిలో గత అయిదేళ్లలో సీఆర్ఎఫ్, ఎన్‌డీబీ ద్వారా చేపట్టిన పనులకు రూ.300 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీరికి రెండు రోజుల క్రితం రూ.90 కోట్ల వరకు కూటమి ప్రభుత్వం బిల్లులు చెల్లించింది. దీంతో కీలకమైన సామర్లకోట-రాజానగరం రహదారి పనుల్లో కదలిక వచ్చింది. సీఆర్ఎఫ్ పనులు పూర్తి చేసేందుకు గుత్తేదారులు చొరవ చూపుతున్నారు.

పరమానందం.. పరంధాముడి పరిణయం


ద్వారకా తిరుమలలో కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు, పండితులు

ద్వారకాతిరుమల: కలియుగ ప్రత్యక్ష దైవం ద్వారకా తిరుమల శ్రీనివాసుడు పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లను పరిణయమాడిన ఘట్టం భక్తులకు నయనానందం పంచింది. ఆశ్వయుజ మాస ఉత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణం గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయానికి తూర్పు వైపున ప్రత్యేక మండపం ఏర్పాటు చేసి సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామి, అమ్మవార్లను వేర్వేరు వాహనాలపై మండపానికి తీసుకొచ్చారు. సుముహూర్త సమయాన జీలకర్ర బెల్లం, మాంగల్య ధారణ, తలంబ్రాలు వంటి కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, దేవస్థానం ఛైర్మన్ సుధాకరరావు, ఈవో మూర్తి, అనువంశిక ధర్మకర్త నివృతరావు ప్రభుత్వం తరఫున స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. కల్యాణ మహోత్సవం అనంతరం వెండి గరుడ, సింహ వాహనాలపై గ్రామోత్సవాలు నిర్వహించారు. స్వామివారు మోహిని అలంకరణలో దర్శనమిచ్చారు.

ఉత్సవాల్లో నేడు: కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి ఏడు గంటలకు స్వామివారి రథోత్సవం ఉంటుంది.

నకిలీలలు

అన్నవరంలో వసతి గదులకు ఫోర్జరీ రసీదుతో హల్‌చల్

అన్నవరం: అన్నవరం దేవస్థానంలో వసతి గదుల కేటాయింపునకు సంబంధించి నకిలీ రసీదును అధికారులు గుర్తించారు. సత్యగిరిపై హరిహరసదన్ వసతి సముదాయంలో నాలుగు గదులు ముందస్తు రిజర్వేషన్ చేయించుకున్నానని.. తనకు కేటాయించాలని ఓ వ్యక్తి బుధవారం రాత్రి వచ్చారు. రసీదు పరిశీలించిన అధికారులు వివరాల్లో తేడా కనిపించి నకిలీగా గుర్తించారు. దీనిపై ప్రశ్నించడంతో జారుకున్నాడు. సాధారణంగా ఒక రసీదుకు ఒక గదిని మాత్రమే కేటాయిస్తారు. కానీ నకిలీ రసీదుపై నాలుగు గదులు, రూ.8 వేల మొత్తం అని ఉంది. ఉద్యోగి సంతకం కూడా ఫోర్జరీ చేసి ఉంది. ఈ ఏడాది ఆగస్టులో విష్ణుసదన్ హాలును ఓ భక్తుడు ముందస్తు రిజర్వేషన్ చేసుకోగా ఆ పత్రాన్ని సేకరించి వివరాలు తమకనుకూలంగా మార్చి ఫోర్జరీ చేసినట్లు భావిస్తున్నారు. అతడిని ఎవరైనా వ్యక్తులు మోసం చేశారా అనే కోణంలోనూ పరిశీలిస్తున్నారు. వసతి గదులకు ఉన్న డిమాండ్‌ను ఆసరాగా చేసుకొని నగదు వసూలు చేసి బోల్తాకొట్టి ఉండొచ్చని తెలుస్తోంది.

దళారుల హవా: గదుల ఆన్‌లైన్ బుకింగ్‌లో కొందరు దళారులు మోసాలకు పాల్పడుతున్నారు. సాధారణంగా 30 రోజులముందే వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ బుకింగ్ చేసుకోవచ్చు. వివిధ పేర్లతో ఆధార్ నకళ్లను సేకరించి గదులను దళారులు దక్కించుకుంటున్నట్లు తెలుస్తోంది. గదులు కేటాయించే సమయంలో ఎవరి ఆధార్‌తో ముందస్తు రిజర్వేషన్ చేయించుకున్నారో ఆ వ్యక్తే రావాలి. ఆధార్ ఎవరు తెచ్చినా గది కేటాయిస్తుండటంతో మోసాలకు ఆస్కారం ఏర్పడుతోంది.

వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శం

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: రామాయణం వంటి దివ్య గ్రంథాన్ని అందించిన మహాత్ముడు.. వాల్మీకి మహర్షి అని కలెక్టర్ షాన్‌మోహన్ పేర్కొన్నారు. బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లో వాల్మీకి జయంతిని అధికారికంగా నిర్వహించారు. మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ వాల్మీకి జీవితాన్ని ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. డీఆర్వో డి.తిప్పేనాయక్, జిల్లా బీసీ సంక్షేమాధికారిణి ఎం.లల్లి, బీసీ కార్పొరేషన్ ఈడీ ఏ.శ్రీనివాసరావు, సహాయ బీసీ సంక్షేమాధికారులు ఎం.సుబ్బారావు, ఎన్.రాజేశ్వరి, రచయిత్రి బి.నాగమణి, బీసీ నాయకులు సుందరపల్లి గోపాలకృష్ణ, మాకిరెడ్డి భాస్కరగణేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న కలెక్టర్, బీసీ నాయకులు

అంగన్‌వాడీల్లో ఆరోగ్యం.. ఆనందం

జిల్లాలో కేంద్రాలు: 1,986
గర్భిణులు: 10,573
బాలింతలు: 11,610
0-6 వయసు పిల్లలు: 1,05,996
సక్షం కింద అప్‌గ్రేడ్ కానున్న కేంద్రాలు: 488

సక్షం పథకానికి 488 కేంద్రాల ఎంపిక

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: ఆరేళ్లలోపు పిల్లలు, గర్భిణులు, బాలింతలకు సమగ్ర పోషణ, ఆరోగ్యంపై అవగాహన, కిశోర బాలికలకు వికాసమే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయి. క్షేత్రస్థాయిలో పలు సమస్యల కారణంగా వందశాతం ఫలితాలు రావట్లేదు. వీటిని అధిగమించి మెరుగైన ఫలితాలు సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్ర మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అడుగులేస్తుంది. మెరుగైన వసతులే లక్ష్యంగా కొన్ని కేంద్రాలను 'సక్షం' (స్టిమ్యులేటింగ్ అడ్వాన్స్‌డ్ నాలెడ్జ్ ఫర్ సస్టెయినబుల్ హెల్త్ మేనేజ్‌మెంట్)కు ఎంపిక చేసింది. జిల్లాలోని తొమ్మిది ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,986 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అందులో 488 సక్షం కింద ఎంపికయ్యాయి. వీటికి ప్రత్యేక నిధులు కేటాయించి, మరిన్ని వసతులు కల్పించనున్నారు.

సమకూరనున్న సదుపాయాలు..

● ఆ కేంద్రాల పరిధిలోని తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణ, బాలల శారీరక, మానసిక ఎదుగుదలకు వసతులు. కేంద్రాల వద్ద ఆహ్లాదకర వాతావరణం కల్పన. ● చిన్నారులకు బాల్యారంభ దశ సంరక్షణ, విద్యాబోధన మెరుగుకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తారు. ● పిల్లల శారీరక, మానసిక, భావనాత్మక అభివృద్ధికి దోహదపడేలా కేంద్రాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతారు. ● అందుకోసం వివిధ రకాల బొమ్మలు, చిత్రాలు, ఆట వస్తువులు సమకూరుస్తారు. ● బల్లలు, కుర్చీలు, ఫర్నీచర్ వంటివి ఏర్పాటు చేస్తారు. ● ఆకట్టుకునే విధంగా బోధనకు, దృశ్య శ్రవణ విద్యకు అవసరమైన పరికరాలు సమకూరుస్తారు. ఆటపాటలకు అనుగుణంగా ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తారు.

ఒక్కో కేంద్రానికి నిధులు..

పోషణ వాటికకు	రూ.10 వేలు
ఇంకుడు గుంతలకు	రూ.16 వేలు
ఇతర సదుపాయాలకు	రూ.19,800


కేంద్రంలో చిన్నారులు..

పోషణ వాటిక..

పోషణ వాటిక పేరుతో ఎంపికైన అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల మొక్కలు పెంచుతారు. వీటితో వచ్చే ఫలసాయాన్ని పోషకాహారంగా వాటి పరిధిలోని పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేస్తారు. భవనాల ఆవరణలో వాన నీటి సంరక్షణకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేస్తారు. నాణ్యమైన రక్షిత నీటిని అందించేందుకు తాగునీటి శుద్ధి యంత్రాలు అమర్చనున్నారు.

నిద్రపోతున్న నిఘా


కాకినాడ టూటౌన్ పోలీసుస్టేషన్ కూడలి వద్ద..

దొంగతనాలు, దోపిడీలు, హత్యలు వంటివి జరిగితే నేరగాళ్లను పట్టుకోవడంలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో కీలకం. అందుకే గృహాలు, వ్యాపార సముదాయాల వద్ద అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు పెట్టుకోవాలని అధికారులే సూచిస్తున్నారు. అలాంటిది జిల్లా కేంద్రమైన కాకినాడ నగరం, గ్రామీణ ప్రాంతాల్లోని పలు ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలు అలంకారప్రాయంగా మారాయి. అందులో కొన్ని విరిగిపోగా, మరికొన్ని చెట్టు కొమ్మల చాటున ఉన్నాయి. వీటిని చక్కదిద్ది, పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. - ఈనాడు, కాకినాడ


జీజీహెచ్ వద్ద చెట్టు కొమ్మ చాటున..


అంబేడ్కర్ కూడలిలో కిందకు వాలిపోయి..

ఉరిమిన వాన


కాలువను తలపిస్తున్న కొత్త కాకినాడ కూడలి

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: వాయుగుండం కారణంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. కాకినాడ నగరంలో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. నగరంలోని ఆర్టీసీ బస్టాండు ప్రాంగణం, ప్రధాన రహదారులు, పలు కాలనీలు ముంపునకు గురయ్యాయి. ప్రయాణికులు బస్టాండులోకి వెళ్లేందుకు, బస్సులు ఎక్కేందుకు ఇబ్బందులు పడ్డారు. కొన్ని రహదారులు కాలువలను తలపించాయి.


శాంతినగర్ మదర్‌థెరిసా కూడలిలో..

7 ప్రమాదకర పరిశ్రమలకు తాఖీదులు

కాకినాడ కలెక్టరేట్: పరిశ్రమల్లో రసాయనాలు నిల్వ ఉంచే స్టోరేజ్ ట్యాంకుల వద్ద సెన్సార్లు, లెవెల్ ఇండికేటర్స్ ఏర్పాటు చేయని ఏడు పరిశ్రమలకు ఫ్యాక్టరీస్ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈనెల 15లోగా వీటిని ఏర్పాటు చేయాలని సెప్టెంబరు 2న కలెక్టర్ ఆదేశించారు. 16వ తేదీ వరకు సెన్సార్లు, లెవెల్ ఇండికేటర్స్ ఏర్పాటు చేయని ఎన్‌సీఎస్ ఇండస్ట్రీస్, సాయిసమిత స్టోర్స్, మహితి స్టోర్స్, ఐఎంసీ, తిరుమలేశా లాజిస్టిక్స్, అంగ్రీన్, కేబీకే బయోటెక్ పరిశ్రమలకు గురువారం నోటీసులు జారీ చేశారు. సంజాయిషీ ఇవ్వాలని లేకపోతే చర్యలు తీసుకుంటామని అందులో పేర్కొన్నారు.

మాలాంటి కడుపుకోత ఎవరికీ వద్దు

- గోదావరిలో మృతి చెందిన విద్యార్థి తండ్రి వేదన
- మునిగిన చోటనే తేలిన మృతదేహం

తాళ్లరేవు, న్యూస్‌టుడే: 'మాలాంటి కడుపుకోత ఎవరికీ రాకూడదు. కంటికి రెప్పలా చూసుకుని ఎంతో అల్లారు ముద్దుగా పెంచుకున్నాం. ఉన్నత చదువులు పూర్తి చేసి కుటుంబానికి అండగా ఉంటాడని భావించా. ఎన్నో ఆశలు పెట్టుకుంటే అర్ధంతరంగా మాయమయ్యాడు. కళాశాలకు వెళ్లి వస్తామని చెప్పాడు.. ఇక్కడికి వచ్చి ప్రాణాలు పోగొట్టుకుంటాడని ఊహించలేదు. ఈ బాధను భరించలేక పోతున్నా. ఈ రేవు వద్ద మరొకరు ఇలా బలికాకుండా చర్యలు చేపట్టాలి. ఎవరూ రాకుండా రహదారి ముఖద్వారం వద్ద గేట్లు ఏర్పాటు చేయాలి.'

ఇదీ కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం ఇంజరం పంచాయతీ గోపులంక పుష్కర రేవు వద్ద గోదావరిలో మునిగి మృతి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి కుతాని సాయిచంద్ర(21) తండ్రి సురేష్ వేదన.


విద్యార్థి తండ్రి సురేష్

స్నేహితులతో కలసి స్నానం చేసేందుకు బుధవారం పుష్కర రేవులో దిగిన సాయిచంద్ర గల్లంతు కాగా, గురువారం రాత్రి మృతదేహం లభించింది. రాజమహేంద్రవరం, తణుకు, తాడేపల్లి గూడెంనకు చెందిన ఏడుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు యానాం విహార యాత్రకు వెళ్లి వస్తూ ఇక్కడ గోదావరిలో దిగిన సమయంలో అతడు గల్లంతైన విషయం తెలిసిందే. రాజమహేంద్రవరం ఎ.వి. అప్పారావు రోడ్డుకు చెందిన సాయిచంద్ర కుటుంబ సభ్యులు, బంధువులు, మిగిలిన ఆరుగురు విద్యార్థులు గురువారం రాత్రి వరకు గోదావరి ఒడ్డున ఆచూకీ కోసం నిరీక్షించారు. తహసీల్దారు పితాని త్రినాథ్ ఆదేశాల మేరకు వీఆర్వోలు సుబ్రహ్మణ్యం, నారాయణరావు, పంచాయతీ కార్యదర్శులు శివప్రసాద్, వల్లీబాబా, కోరంగి పోలీసు, తెదేపా నాయకుడు వేగేశ్న శ్రీనురాజుల పర్యవేక్షణలో గల్లంతైన నుంచి గురువారం రాత్రి వరకు గోదావరిలో గాలించారు. రెండు పడవలపై 14 మంది జాలర్లు ఆ ప్రాంతాన్ని జల్లెడ పట్టారు. చివరకు అతడు మునిగిపోయిన ప్రాంతంలోనే రాత్రి సమయానికి మృతదేహం తేలింది. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎస్‌డీఆర్ఎఫ్ ఆర్ఎస్సై శివకుమార్ బృందం గురువారం రాత్రి అక్కడికి చేరుకుంది. గాలింపు చర్యలపై ఎమ్మెల్యేలు దాట్ల బుచ్చిబాబు, ఆదిరెడ్డి వాసు ఫోన్‌లో మాట్లాడారు.


గోపులంక పుష్కర రేవు వద్ద బాధిత కుటుంబ సభ్యులు, విద్యార్థులు



ఊరేగింపు.. శోభాయమానం

దేవతామూర్తుల వేషధారణలతో గొల్లప్రోలులో గురువారం భారీ ఊరేగింపు నిర్వహించారు. దేవీ నవరాత్రి మహోత్సవాలు ముగిసిన నేపథ్యంలో నిమజ్జనోత్సవంలో భాగంగా స్థానిక సూరంపేటలోని కనకదుర్గ అమ్మవారి ఆలయం నుంచి భారీ సంఖ్యలో ట్రాక్టర్లతో ప్రదర్శన కొనసాగించారు. కనకదుర్గ అమ్మవారి వేషధారణ ప్రత్యేకంగా నిలిచింది. తీన్‌మార్ డప్పు వాయిద్యాలు, నృత్యాలతో ఊరేగింపు నిర్వహించారు. 32 ఏళ్లుగా సూరంపేటలోని కనకదుర్గమ్మ ఆలయంలో దేవీ నవరాత్రి మహోత్సవాల్లో దేవతామూర్తుల వేషధారణలతో ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు.

- న్యూస్‌టుడే, గొల్లప్రోలు

ఆశల పల్లకిలో ఆశావహులు

● సాగునీటి సంఘాలపై నేతల దృష్టి ● అప్పుడే మొదలైన పైరవీలు

న్యూస్‌టుడే, పి.గన్నవరం, ముమ్మిడివరం

గత తెదేపా హయాంలో పంట, మురుగు కాలువలు, సాగు నీటి కట్టడాల నిర్వహణ పనులను సాగు నీటి సంఘాల ప్రతినిధుల పర్యవేక్షణలో నిర్వహించే వారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా అయిదేళ్లపాటు ఈ వ్యవస్థను పక్కన పెట్టేయడంతో రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం సాగు నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. వాస్తవానికి ముందు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 16న ఎన్నికలకు ప్రకటన ఇవ్వాల్సి ఉండగా తుపాను కారణంగా తాత్కాలికంగా వాయిదావేసినట్లు జలవనరులశాఖ అధికారులు చెబుతున్నారు. వర్షాలు తగ్గిన తరువాత ఇవ్వనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఈ పదవులను ఆశించే ఆశావహులు ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. తెదేపా, జనసేన, భాజపా నేతలు పలువురు సాగు నీటి సంఘాలకు ప్రతినిధులు కావాలని ఉవ్విళ్లూరుతున్నారు.

సాగు నీటి సంఘాల ఎన్నికలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో టీసీల వారీ ఓటర్ల జాబితాలు తయారు చేసే పనిలో రెవెన్యూ యంత్రాంగం నిమగ్నమైంది. జలవనరులశాఖ వద్ద గతంలో ఉన్న రికార్డుల మేరకు టీసీల వారీ ఆయకట్టు, సర్వే నంబర్లవారీ రైతుల వివరాలను ఆ శాఖ అధికారులు ఇప్పటికే రెవెన్యూ శాఖ అధికారులకు అందజేశారు. గతంలో ఉన్న సాగు భూములు ఇళ్ల స్థలాలు, ఇతర కట్టడాలుగా మారాయి. అలాంటి వాటిని ఓటర్ల జాబితానుంచి తొలగిస్తారు. ప్రస్తుతం వాస్తవంగా ఉన్న ఓటర్ల(రైతులు)తో తాజాగా ఓటర్ల జాబితాలను రూపొందిస్తున్నారు.



పి.గన్నవరం డొక్కా సీతమ్మ అక్విడక్టు

ఉమ్మడి జిల్లాలో ఇలా

గోదావరి డెల్టా సిస్టమ్ పరిధిలో 144 సాగునీటి వినియోగదారుల సంఘాలు, 25 నీటి పంపిణీ కమిటీలు, ఒక ప్రాజెక్టు కమిటీ ఉన్నాయి. ● ఏలేరు రిజర్వాయర్ ప్రాజెక్టు పరిధిలో 25 సాగునీటి సంఘాలు, అయిదు నీటి పంపిణీ కమిటీలు, ఒక ప్రాజెక్టు కమిటీ ● తొర్రిగడ్డ పంపింగ్ స్కీములో నాలుగు సాగు నీటి సంఘాలు, ఒక ప్రాజెక్టు కమిటీ ● పంపా రిజర్వాయర్ ప్రాజెక్టులో ఆరు సాగు నీటి సంఘాలు, ఒక ప్రాజెక్టు కమిటీ ● సుబ్బారెడ్డిసాగర్ ప్రాజెక్టులో ఆరు సాగునీటి సంఘాలు, ఒక ప్రాజెక్టు కమిటీ ● మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పరిధిలో 216 సాగు నీటి సంఘాలు ఉన్నాయి.

తమ స్థాయిని బట్టి..

● నాయకులు తమ స్థాయినిబట్టి అధ్యక్షులు, నీటి పంపిణీ కమిటీ ఛైర్మన్ల పదవులను కొందరు, ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్లు కావాలని మరికొందరు ఆశిస్తున్నారు. పి.గన్నవరం మండలంలో ఒక సాగు నీటి సంఘానికి సంబంధించి ఇద్దరు గట్టిగా పోటీపడుతున్నారు. ఇద్దరిలో ఒకరు పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఒక ఎమ్మెల్యే ద్వారా కోనసీమలోని ఒక ఎమ్మెల్యేకి అప్పుడే సిఫార్సు చేయించినట్లు సమాచారం. గతంలో పని చేసిన సాగు నీటి సంఘాల ప్రతినిధులు ఎక్కువగా మళ్లీ ఈ పదవులను ఆశిస్తున్నారు. కొందరైతే నేరుగా జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వద్దకు వెళ్లి బయోడేటాలు ఇస్తున్నట్లు తెలిసింది. ప్రధానంగా ముందుగా టీసీ మెంబరు కావాలి. ఇందుకోసం టెరిటోరియల్ కానిస్టెన్సీ పరిధిలోని ఓటర్లైన రైతులను కూడా ఆశావహులు కలిసి తమకు సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

గతంలోని కమిటీలన్నింటికీ...

సాగునీటి సంఘాలకు సంబంధించి ఓటర్ల జాబితాలు తయారు చేస్తున్నారు. దాదాపుగా గతంలో ఉన్న కమిటీలకు ఎన్నికలు జరుగుతాయి. నోటిఫికేషన్ వాయిదా పడటంతో షెడ్యూల్‌లో కూడా మార్పులు ఉంటాయి.

- ఎన్.పుల్లారావు, చీఫ్ ఇంజినీర్, గోదావరి డెల్టా సిస్టమ్

గిరి ప్రదక్షిణ ఏర్పాట్ల పరిశీలన

అన్నవరం, న్యూస్‌టుడే: పవిత్ర కార్తీక మాసంలో నవంబరు 15న జరగనున్న అన్నవరం సత్యదేవుని గిరి ప్రదక్షిణ ఏర్పాట్లను అధికారుల బృందం గురువారం పరిశీలించారు. ఇంజినీరింగ్, వివిధ విభాగాల అధికారుల బృందం గిరిప్రదక్షిణ జరిగే మార్గంలో భక్తులకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. రోడ్డును శుభ్రం చేయడం, ఎండు గడ్డి వేయడం, తాగునీరు, పండ్లు, ఇతర ఆహార పదార్థాలు, ప్రసాదం పంపిణీకి స్టాల్స్, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు తదితరాలను పరిశీలించారు.

● దేవస్థానంలో గురువారం రద్దీ నెలకొంది. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. నూతన వధూవరుల సందడి కనిపించింది. కొండపైన, వివిధ ప్రాంతాల్లో వివాహాలు చేసుకున్న నూతన వధూవరులు పెద్దసంఖ్యలో వచ్చి వ్రతమాచరించి, స్వామిని దర్శించుకున్నారు. పౌర్ణమి సందర్భంగా అమ్మవారి ఆలయంలో ప్రత్యంగిర హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు.



మార్గాన్ని పరిశీలిస్తున్న ఆలయ అధికారులు

నర్సుల ఎన్నికల్లో ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఏకగ్రీవం

మసీదు సెంటర్(కాకినాడ): ఏపీ ప్రభుత్వ నర్సెస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా సంఘ ఎన్నికలకు సంబంధించి మొత్తం 17 నామినేషన్లు దాఖలయ్యాయి. వాటిని పరిశీలించగా, ఒకటి సరిగా లేకపోవడంతో తిరస్కరణకు గురైనట్లు ఎన్నికల అధికారి టి.సంతు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మిగిలిన 16 సక్రమంగా ఉన్నాయన్నారు. ఎగ్జిక్యూటివ్ సభ్యుల పదవులకు వచ్చిన ఆరు నామినేషన్లలో ఒకటి తిరస్కరణకు గురవడంతో అయిదు మాత్రమే మిగలడంతో ఏకగ్రీవం అయ్యాయని ప్రకటించారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి పదవులకు 23న ఎన్నికలు జరుగుతాయన్నారు. 18 సాయంత్రం 5 గంటల వరకు నామపత్రాల ఉపసంహరణకు గడువు ఉందన్నారు.

పారిశ్రామిక విధానాలపై కార్మిక సంఘాలతో చర్చించాలి

గాంధీనగర్, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబునాయుడు నూతనంగా ప్రవేశపెడుతున్న పారిశ్రామిక విధానాలపై కార్మిక సంఘాలతో చర్చించిన తర్వాతే తుది రూపు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. గురువారం కొండపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రగతి ముఖ్యమని కొత్తగా ఆరు పాలసీలను ప్రకటించారని, ఇప్పటివరకు ఉన్న మూడు పారిశ్రామిక విధానాలు, వాటి ప్రగతి గురించి చెప్పలేదన్నారు. ఎన్నికల ముందు జగన్‌మోహన్‌రెడ్డి రూ.24 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయన్నారు, ఇపుడు చంద్రబాబు రూ.30 లక్షల కోట్లు అంటున్నారన్నారు. 20 లక్షల ఉద్యోగాలు పక్కన పెడితే ఇప్పటివరకు ఎన్ని ఉద్యోగాలు కల్పించారో చెప్పాలన్నారు. ఇంటికో పారిశ్రామికవేత్త ఆలోచన బాగున్నా వ్యవసాయం సంగతేంటన్నారు. కేంద్రం గోధుమ, ఇతర పంటలకు గిట్టుబాటు ధర కల్పించిందని, రాష్ట్రంలో ప్రధానంగా పండే వరి పంటకు ఎందుకు ధర పెంచలేదన్నారు. గతంలో ప్రధాని మోదీ చేతిలో జగన్‌మోహన్‌రెడ్డి కీలుబొమ్మగా ఉంటే నేడు చంద్రబాబు అలాగే వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికీ పలువురు మత్స్యకారులకు వేట నిషేధ పరిహారం అందలేదన్నారు. వచ్చేనెల 8 నుంచి 15 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాపోరు పేరుతో నిరసనలు చేపడతామన్నారు. మద్యం దుకాణాలు ఎక్కడ పడితే అక్కడ పెట్టకుండా స్థానికుల అభిప్రాయం తీసుకోవాలన్నారు. సీపీఎం నాయకులు ఏవీ నాగేశ్వరరావు, జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, దువ్వా శేషబాబ్జీ, కేఎస్.శ్రీనివాసు, కె.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

జె.తిమ్మాపురానికి రూ.25 లక్షలతో ఆర్వో ప్లాంటు

పెద్దాపురం, న్యూస్‌టుడే: పెద్దాపురం మండలంలోని జె.తిమ్మాపురం గ్రామస్థులు స్వచ్ఛమైన నీరు తాగేందుకు నెక్కంటి సీఫుడ్స్ కంపెనీ ఎండీ నెక్కంటి వెంకట్రావు రూ.25 లక్షల విలువైన ఆర్వో వాటర్ ప్లాంటును బుధవారం బహూకరించారు. ప్లాంటును అమెరికా నుంచి వచ్చిన మీజర్ రిటైల్ సూపర్ మార్కెట్, ఈస్టర్న్ ఫిష్ కంపెనీకి చెందిన ప్రతినిధులు ప్రారంభించారు. గతంలో నెక్కంటి సీఫుడ్స్ సంస్థ పరిసర గ్రామాల్లో రోగులకు విశ్రాంత హాలు, రెండు వైద్యుల ఛాంబర్లు, గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు భోజనశాల, డిజిటల్ తరగతి గది ఏర్పాటు చేసింది. సేవలను పలువురు ప్రశంసించారు. కంపెనీ అడ్మినిస్ట్రేషన్ మేనేజర్ గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.



నెక్కంటి సీఫుడ్స్ ఇచ్చిన ప్లాంటును ప్రారంభిస్తున్న అమెరికా ప్రతినిధులు

నవోదయ 9, 11 తరగతుల్లో చేరేందుకు అవకాశం

పెద్దాపురం: పెద్దాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న 9, 11వ తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వైస్ ప్రిన్సిపల్ రామకృష్ణయ్య గురువారం తెలిపారు. కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన విద్యార్థులు అవకాశం వినియోగించుకోవచ్చన్నారు. దరఖాస్తులను నవోదయ వెబ్‌సైట్ ద్వారా చేసుకోవాలన్నారు.

పశువుల ఆరోగ్య రక్షణకు చర్యలు

కాకినాడ కలెక్టరేట్: కాకినాడలోని జంతు హింస నివారణ సంఘం(ఎస్‌పీసీఏ) ఆశ్రమంలోని పశువుల పోషణ, ఆరోగ్య రక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో మున్సిపల్, రెవెన్యూ, పశుసంవర్థకశాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. వర్షాలకు ఆశ్రమ ఆవరణ చిత్తడిగా ఉండడం, పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎస్‌పీసీఏ నిర్వహణపై పరిశీలనకోసం సంయుక్త కలెక్టర్ రాహుల్ మీనాను నియమించినట్లు తెలిపారు. ఈనెల 24లోగా నివేదిక ఇవ్వాలన్నారు. ఎస్‌పీసీఏ ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. దుకాణాల అద్దెలు సక్రమంగా వసూలు చేయాలన్నారు. కాకినాడ మున్సిపల్ కమిషనర్ భావన, ఉప కమిషనర్ ఎస్.మనోహర్, ఎంహెచ్‌వో డి.పృథ్వీచరణ్, పశుసంవర్థకశాఖ జేడీ ఎస్.సూర్యప్రకాశరావు, తహసీల్దారు వి.జితేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి శుద్ధి కేంద్రం వద్దని ధర్నా

సామర్లకోట, న్యూస్‌టుడే: జనావాసాల మధ్య మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మించొద్దంటూ సామర్లకోట మున్సిపల్ కార్యాలయం వద్ద బైఠాయించి గణేష్‌కాలనీ వాసులు గురువారం ధర్నా చేశారు. పట్టణంలో మురుగు దొడ్లు, ఇతర వ్యర్థాలను శుద్ధిచేసే ప్లాంటును తాము నివసించే ప్రాంతంలో నిర్మించవద్దని అధికారులకు విన్నవించినా కక్ష పూరితంగా దళితులు, పేదల కాలనీ వద్ద నిర్మించడం దారుణమన్నారు. మానవహక్కుల పరిరక్షణ సంఘం జిల్లా అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ మాట్లాడుతూ పట్టణంలో అనేక ప్రాంతాల్లో మున్సిపల్ స్థలాలు ఉన్నప్పటికీ ఇక్కడే ఎందుకు ప్లాంటు నిర్మించాలని ప్రశ్నించారు. ఆందోళనకారులతో కమిషనర్ శ్రీవిద్య చర్చించారు. కౌన్సిల్ సభ్యులతో చర్చించి సమస్యను ఉన్నతాధికారులకు తెలుపుతామన్నారు. కౌన్సిలర్లు మర్రి శేషారావు, నేతల హరిబాబు, నాయకులు పోలిమాటి ప్రసాద్, పాలిక చంటిబాబు, నూతలపాటి అప్పారావు, గొల్లపల్లి సత్యనారాయణ, శ్రీనివాస్, సత్యానందం తదితరులు పాల్గొన్నారు.



పురపాలిక కార్యాలయం వద్ద నినదిస్తున్న కాలనీవాసులు

ఎఫ్‌పీసీ బాధ్యతల అప్పగింత

ధవళేశ్వరం: జలవనరులశాఖలో పనిచేస్తున్న డిప్యూటీ ఈఈలకు ఎఫ్‌పీసీ బాధ్యతలు అప్పగిస్తూ ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ధవళేశ్వరం పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు ఎల్ఎంసీ డివిజన్‌లో పనిచేస్తున్న డిప్యూటీ ఈఈ కె.శ్రీనివాసరావుకు పీఏపీ ఎల్ఎంసీ డివిజన్ ఎలమంచిలి, తుని పీఏపీలో ఎస్ఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. గన్నవరం పీఏపీ ఆర్ఎంసీ సబ్‌డివిజన్‌లో డిప్యూటీ ఈఈగా పనిచేస్తున్న ఎం.కిషోర్‌కు డ్రైనేజీ డివిజన్ కాకినాడ ఇరిగేషన్ సర్కిల్, ధవళేశ్వరంలో ఎఫ్‌పీసీ బాధ్యతలు ఇచ్చారు.

విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి సీఎం కృషి

సర్పవరం జంక్షన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని విశ్వబ్రాహ్మణ సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు పండూరు జయకృష్ణ తెలిపారు. గురువారం అమరావతిలో ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపామన్నారు. ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీ ప్రకారం స్వర్ణకారుల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని, క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారని తెలిపారు.



అమరావతిలో చంద్రబాబును కలిసిన జయకృష్ణ

క్రమశిక్షణకు మారుపేరు స్కౌట్స్, గైడ్స్

సాంబమూర్తినగర్, కాకినాడ నగరం: క్రమశిక్షణకు మారు పేరు స్కౌట్ అండ్ గైడ్స్ అని డీఈవో పి.రమేష్ పేర్కొన్నారు. ఆ శాఖ చీఫ్ కమిషనర్, జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ అధ్యక్షతన స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కమిటీ సమావేశం గురువారం జరిగింది. జిల్లా సెక్రటరీ ఎంవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డీఈవో మాట్లాడారు. ప్రతీ పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లు ఏర్పాటుచేసి విద్యార్థుల్లో క్రమశిక్షణ, మంచి గుణాలు పెంపొందించాలన్నారు. సమాజానికి ఉత్తమ పౌరులను అందించాలంటే శిక్షణ తప్పనిసరి అన్నారు. అనంతరం 40 మంది ఉపాధ్యాయులకు ధ్రువపత్రాలు అందజేశారు. జిల్లా అసిస్టెంట్ కమిషనర్ షంషాద్‌బేగం, జాయింట్ సెక్రటరీ వి.మాచరరావు, డీవీఎస్ లక్ష్మీకుమారి, అసిస్టెంట్ ట్రైనీ కమిషనర్లు వి.నీలిమ, కె.సుబ్రహ్మణ్యం, శ్రీహరిరాజు, రాజేశ్వరి, పి.పద్మ పాల్గొన్నారు.



ధ్రువపత్రాలు అందుకున్న ఉపాధ్యాయులు

న్యాయ సేవాధికార సంస్థ గోడపత్రిక ఆవిష్కరణ

కాకినాడ కలెక్టరేట్: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ గోడపత్రికను గురువారం కలెక్టరేట్‌లో ఆర్డీవోలు ఎస్.మల్లిబాబు, కె.శ్రీరమణితో కలిసి కలెక్టర్ షాన్‌మోహన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంస్థ ఆదేశాల మేరకు జిల్లాలో అందరికీ న్యాయపరమైన సూచనలు, సలహాలు అందుబాటులో ఉండే విధంగా కృషి చేస్తామన్నారు. జిల్లా వాసులు ఉచిత న్యాయ సలహాలు, సంప్రదింపులకు టోల్‌ఫ్రీ నంబరు 15100 వినియోగించుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తుకు www.nalsa.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

తుపాను బాధితులకు ప్రభుత్వం అండ: వర్మ

కొత్తపల్లి, న్యూస్‌టుడే: తుపాను ప్రభావం కారణంగా తీర ప్రాంత గ్రామాల్లో గృహాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ హామీ ఇచ్చారు. గురువారం యు.కొత్తపల్లి మండలంలోని తీర ప్రాంత గ్రామాల్లో ఆయన పర్యటించి కోతకు గురైన ప్రాంతాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబాలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వైకాపా ప్రభుత్వంలో అర్హులకు కాకుండా, వారికి నచ్చినవారికి ఇళ్లస్థలాలు ఇచ్చారన్నారు. సముద్రం ఒడ్డునున్న ప్రతి కుటుంబానికి సురక్షిత ప్రాంతాల్లో ఇళ్లస్థలాలు కేటాయించి పక్కా గృహాలు నిర్మించే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తీర ప్రాంతాలు కోతకు గురవకుండా రక్షణగోడ నిర్మిస్తామని హామీ ఇచ్చారని, త్వరలోనే ఆ ప్రాజెక్టు ముందుకొస్తుందన్నారు. కాకినాడ ఆర్డీవో మల్లిబాబు ఉప్పాడ, జగ్గరాజుపేట, సూరాడపేటల్లో పర్యటించి కోత పరిస్థితిని పరిశీలించారు. ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దన్నారు. కూలిన స్తంభాలు మార్చి విద్యుత్తు సౌకర్యం కల్పిస్తామన్నారు.



సూరాడపేటలో కోత తీరును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

సైన్స్ సెంటర్ పరిశీలన

పెద్దాపురం: పెద్దాపురం పట్టణం రామారావుపేటలోని అల్లంరాజు ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏసీటీ సైన్స్ సెంటర్‌ను గురువారం విజయవాడకు చెందిన మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం ఛైర్మన్ పి.మధు, కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ సందర్శించారు. ఈ సందర్భంగా సైన్స్ సెంటర్లోని వివిధ రకాల పరికరాల గురించి, విద్యార్థులకు ప్రయోగాలు చెప్పే విధానాన్ని సెంటర్ నిర్వాహకుడు బుద్ధా శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి కేంద్రాలుగా విద్యార్థులకు ఉపయోగపడే విధంగా సైన్స్ సెంటర్లను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు వారు తెలిపారు. వెంట నవీన్ నాని, సునీత ఉన్నారు.



కేంద్రం పనితీరుపై ఆరా తీస్తున్న మధు

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి)	11,500
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	13,000-13,500
కొత్త (పచ్చి) కాయ	12,500-13,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	130-00
రిటైల్ లైవ్	152-00
డ్రెస్డ్	220-00
స్కిన్‌లెస్	251-00

గంజాయితో పట్టుబడ్డ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

హైదరాబాద్, న్యూస్‌టుడే: వారంతా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే. ప్రముఖ కంపెనీల్లో పనిచేస్తూ ఆకర్షణీయమైన జీతం అందుకుంటున్నారు. కానీ, గంజాయికి బానిసై జైలు పాలయ్యారు. కేపీహెచ్‌బీ ఎస్సై సుమన్ వివరాల ప్రకారం.. గురువారం మధ్యాహ్నం కేపీహెచ్‌బీ అయిదో ఫేజ్ డీమార్ట్ సమీపంలోని ఖాళీస్థలంలో పలువురు యువకులు గంజాయి పొట్లాలతో ఉన్నారన్న సమాచారంతో బాలానగర్ జోన్ ఎస్వోటీ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. యువకులు పారిపోయేందుకు యత్నించగా చాకచక్యంగా పట్టుకుని కేపీహెచ్‌బీ పోలీసులకు అప్పగించారు. యువకులు పని ఒత్తిడి నుంచి ఉపశమనం కోసమే గంజాయి తాగుతున్నట్లు పోలీసులకు చెప్పడం గమనార్హం. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలానికి చెందిన తోరటి రాజేశ్(24), కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలానికి చెందిన నక్కా నాగవంశీ(23), తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం శివారు నరేంద్రపురం గ్రామానికి చెందిన తంగెళ్ల రమేశ్‌కృష్ణ(27), పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన జంపని సాయిగోపి విహారి(26) సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. రాజేశ్ కైత్లాపూర్‌లో, మిగతా ముగ్గురు కేపీహెచ్‌బీ మూడో ఫేజ్‌లోని వసతి గృహాల్లో ఉంటున్నారు. కొంతకాలంగా వీరు గంజాయి తాగుతూ అనుమానం రాకుండా గంజాయిని తెల్ల కాగితాల్లో చుట్టి విక్రయిస్తున్నారు. రాజేశ్ తూర్పుగోదావరి జిల్లా నుంచి గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తుంటాడు. బీటెక్ చదివే రోజుల్లోనే గంజాయికి అలవాటు పడ్డ రాజేశ్ మిగతావారికి అలవాటు చేశాడు. పోలీసులు నిందితుల నుంచి సుమారు 1300 గ్రాముల గంజాయి, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

కత్తితో దాడి.. కేసు నమోదు

కొత్తపల్లి, న్యూస్‌టుడే: ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఏర్పడిన గొడవలో ఓ వ్యక్తిపై తండ్రీకొడుకులు కత్తితో దాడిచేసిన ఘటన గురువారం యు.కొత్తపల్లి మండలం మూలపేటలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామంలో నందీశ్వరుడి ఆలయం వద్ద భజన కార్యక్రమం జరుగుతోంది. ఆ సమయంలో యువకుడు ఆవల మణికంఠ అక్కడికి వచ్చి విఘాతం కలిగిస్తుంటే గ్రామానికి చెందిన తాతీలు హెచ్చరించారు. దీంతో ఇరువురి మధ్య ఘర్షణ నెలకొంది. ఆ వెంటనే తాతీలుపై మణికంఠ, అతని తండ్రి లోవరాజు కత్తితో దాడి చేసి పరారయ్యారు. తాతీలును చికిత్స నిమిత్తం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ్నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

కాకినాడ

రైతుబజార్‌లో నిన్నటి కూరగాయల ధరలు(కిలోకు)

గాంధీనగర్: టమాటా - 38, వంకాయలు - 40,54, బెండకాయలు - 30, పచ్చిమిర్చి - 40,58, కాకరకాయ - 28, బీర - 30,36, కాలీఫ్లవర్ - 15,20, క్యాబేజీ - 44, క్యారెట్ - 48, దొండకాయలు - 24, బంగాళాదుంపలు - 30,36, ఉల్లి - 45,50, గోరుచిక్కుళ్లు - 30, దోసకాయలు - 36, ఆనపకాయ - 32,40, పొట్లకాయ - 18,20, అరటికాయ - 6,7, చిక్కుళ్లు - 86, చేమదుంపలు - 34,44, మునగకాడలు - 10,12, బీట్‌రూట్ - 40, కీరదోస - 24, బీన్స్‌గింజలు - 130, అల్లం - 55, క్యాప్సికం - 100, బొబ్బర్లు - 48, చిలకడదుంపలు - 40, నిమ్మకాయలు(డజన్) - 24,48,54.

నగరంలో సినిమాలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఆనంద్ సినిమాస్ 4స్క్రీన్- **విశ్వం, వెట్టయాన్ ది హంటర్, ఇద్దరు, జనక అయితేగనక, సత్యం సుందరం,** దేవీ మల్టీప్లెక్స్ 4స్క్రీన్- **డిడెవిల్, విశ్వం, దేవర పార్ట్ I, మానాన్న సూపర్‌హీరో,** లక్ష్మీ- **కల్లు కాంపౌండ్(ఉ,సా), ఇద్దరు(మ,రా),** సత్యగౌరి- **లవ్‌రెడ్డి,** తిరుమల - **ఖడ్గం(ఉ.8గంటలకు), వెట్టయాన్ ది హంటర్ ,** సిఅండ్‌సి 1- **జనక అయితేగనక,** సీఅండ్‌సీ 2- **శ్వాగ్,** శ్రీప్రియ - **మార్టిన్,** పద్మప్రియ- **దేవర పార్ట్ I,** సూర్య1(వాకలపూడి) - **దేవర పార్ట్ I,** సూర్య 2- **జనక అయితేగనక(ఉ,సా) విశ్వం(మ,రా),** శ్రీశ్రీనివాసా(వేళంగి)- **వెట్టయాన్ ది హంటర్(ఉ.సా)విశ్వం(మ.రా).**

రింక్‌లో రయ్.. రయ్..

నేటినుంచి రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలు


సాధన చేస్తున్న క్రీడాకారులు

మసీదు సెంటర్, న్యూస్‌టుడే: కాకినాడలో శుక్రవారం ప్రారంభమయ్యే ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఆంధ్రప్రదేశ్ అంతర్‌జిల్లాల ఎస్‌జీఎఫ్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్-2024కు రాజాట్యాంక్ ప్రాంగణంలోని వైఎస్సార్ స్కేటింగ్ రింక్ వేదిక కానుంది. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో అండర్-11, 14, 17, 19 తదితర విభాగాల్లో క్వాడ్, ఇన్‌లైన్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారు. ప్రారంభ కార్యక్రమానికి కలెక్టర్, ప్రజాప్రతినిధులు హాజరవుతారు.

400 మంది క్రీడాకారులు..

13 జిల్లాల నుంచి సుమారు 400 మంది వస్తున్నారు. గురువారం రాత్రికి 300 మంది వచ్చారని నిర్వాహకులు తెలిపారు. ఏర్పాట్లను సుమారు 70 మంది అఫిషియల్స్, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తున్నారు. బాలికలకు స్థానిక సాలిపేట బాలికోన్నత పాఠశాలలో, బాలురుకు గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్‌లో వసతి కల్పించారు.

ఏర్పాట్లు పూర్తి..

మూడు రోజుల పాటు కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ స్కేటింగ్ పోటీలకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే చాలామంది వచ్చారు. మిగిలిన వారు శుక్రవారం ఉదయానికి వస్తారు. డీఈవో రమేష్ ఆదేశాల మేరకు క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం.

- లంకా జార్జి, పాఠశాల క్రీడా సమాఖ్య, జిల్లా కార్యదర్శి

బహుళ అంతస్తుల్లో.. బహుపరాక్..

ఒంటరి మహిళలే లక్ష్యంగా దొంగతనాలు

10.10.24

కాకినాడ సినిమారోడ్డు నెల్లిఅప్పన్న సెంటరులోని ఓ అపార్టుమెంట్‌లో ఓ కుటుంబం నివసిస్తోంది. దసరా సెలవులు కావడంతో పిల్లలు బంధువుల ఇంటికి, భర్త పనిమీద బయటకు వెళ్లారు. భార్య ఒక్కరే ఉండగా స్వచ్ఛంద సేవా సంస్థ పేరుతో ఓ వ్యక్తి వచ్చారు. విరాళం అడిగితే ఆమె లేవన్నారు. మంచి నీళ్లు కావాలని ఆ వ్యక్తి అడిగారు. ఆమె వెనక్కి తిరగ్గానే మత్తుమందు చల్లి 50 గ్రాముల బంగారు, 500 గ్రాముల వెండి, నగదు దోచేశాడు.

24.07.24

రామారావు పేటలోని ఓ అపార్టుమెంట్‌లో 79 ఏళ్ల వృద్ధురాలు ఒంటరిగా జీవిస్తున్నారు. ఓ గుర్తు తెలియని మహిళ ఆమెతో మాటలు కలిపింది. ఆపై మీరు నీరసంగా కనిపిస్తున్నారంటూ వృద్ధురాలికి బీట్‌రూట్ జ్యూస్ ఇచ్చింది. ఆవిడ మత్తులోకి వెళ్లిపోగానే రూ. రెండు లక్షలు విలువైన బంగారు ఆభరణాలు దోచుకుపోయింది.


చోరీ జరిగిన ఇంట్లో చెల్లాచెదురుగా వస్తువులు (పాత చిత్రం)

మసీదు సెంటర్, న్యూస్‌టుడే: నగరంలో బహుళ అంతస్తు భవనాల సంప్రదాయం పెరుగుతోంది. వ్యక్తిగత ఇళ్ల కంటే ఇవి తక్కువ ధరకు లభిస్తుండటంతో చాలామంది వీటిని కొనేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఉద్యోగ రీత్యా వేరే ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చేవారు అపార్టుమెంట్‌లో ఉండేందుకే ఆసక్తి చూపిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఒంటరి మహిళలు, వృద్ధులే లక్ష్యంగా చోరీలు జరుగుతున్నాయి. నగర పరిధిలో సుమారు 500కు పైగా అపార్టుమెంట్లు ఉన్నాయి. శివారు ప్రాంతాల్లోనూ వీటి సంఖ్య నానాటికీ పెరుగుతుండగా చోరీలూ పెరుగుతున్నాయి. గతంలో రాత్రిపూటే దొంగతనాలు జరిగేవి. ఇప్పుడు పగలు కూడా దర్జాగా జరుగుతుండటం గమనార్హం. ఈ క్రమంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

నాలుగేళ్లలో చోరీలు

ఏడాది	కేసులు
2021	128
2022	132
2023	112
2024	79

(ఇప్పటివరకు)

ఈ జాగ్రత్తలు అవసరం..

● సాధారణంగా అపార్టుమెంట్లలో ఒకరికి మరొకరు సంబంధం లేకుండా ఉంటారు. అది సరి కాదు. అందరూ ఆరోగ్యకరమైన సంబంధాలు కలిగి ఉండాలి. అసోసియేషన్‌గా ఏర్పడాలి. ● సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. వాచ్‌మెన్‌ను నియమించుకోవాలి. ● ఎవరు వస్తున్నారు. ఎందుకు లాంటి వివరాలన్నీ వాచ్‌మెన్ రాసుకోవాలి. ● స్వచ్ఛంద సంస్థలు, విరాళాల పేరుతో ఎవరైనా వస్తే ఆ వ్యక్తితో పాటు వాచ్‌మెన్ లేదా అపార్టుమెంట్‌కు చెందిన ఒకరు ఉండాలి. ● ఇంట్లో ఒక్కరే ఉన్నప్పుడు తెలియని వ్యక్తులు వస్తే వెంటనే తలుపులు తీయకూడదు. ● కొత్త వ్యక్తులు మాట కలిపేందుకు ప్రయత్నించినా కనీసం 10 అడుగుల దూరం నుంచి మాట్లాడాలి. ● రాత్రిపూట మెట్లు, కారిడార్, పార్కింగ్ ప్రాంతాల్లో దీపాలు వెలుగుతుండాలి. ● అనుమానాస్పదంగా ఎవరు అనిపించినా వెంటనే అసోసియేషన్‌కు తెలియజేయాలి. ● డెలివరీ బాయ్స్ వస్తే వారి బండి వివరాలు నమోదు చేసుకోవడం మంచిది. ● కిటికీలకు, ప్రధాన ద్వారాలకు ఇనుప గ్రిల్స్ పెట్టించుకోవాలి. ● ఊరు వెళ్తుంటే పోలీసులకు సమాచారం ఇచ్చి, ఇంటికి ఎల్‌హెచ్‌ఎంఎస్ పెట్టించుకోవాలి. వీటితో చోరీలకు అడ్డుకట్ట వేయొచ్చు.


రఘువీర్ విష్ణు, కాకినాడ డీఎస్పీ

ఏఆర్‌టీ కేంద్రం పరిశీలన

మసీదు సెంటర్: నగరంలో నూతనంగా ఏర్పాటు చేసుకునేందుకు దరఖాస్తు చేస్తున్న ఏఆర్‌టీ (అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నిక్స్) లెవల్-2 కేంద్రాన్ని జిల్లా ఏఆర్‌టీ, సరోగసీ బృందం గురువారం పరిశీలించింది. డీఎంహెచ్‌వో నరసింహనాయక్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఆసుపత్రులు, డయాగ్నోస్టిక్ కేంద్రాల్లో ఏఆర్‌టీ, సరోగసి, పీసీపీఎన్‌డీటీ యాక్ట్ కేంద్రాలు నిర్వహించకూడదన్నారు. తనిఖీల్లో జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. లావణ్యకుమారి, రేడియాలసిస్ట్ డా. సునీత, పెథాలజిస్ట్ డా. రాజ్యలక్ష్మి, ఎన్‌జీవో సపురా, డెమో సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు


గోడపత్రిక ఆవిష్కరిస్తున్న డిపో అసిస్టెంట్ కమిషనర్, అధికారులు

సాంబమూర్తినగర, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా కాకినాడ డిపో నుంచి పంచారామ క్షేత్రాలు, ఇతర శైవక్షేత్రాల దర్శనం కోసం ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపో అసిస్టెంట్ ఎంయూవీ మనోహర్ తెలిపారు. బస్టాండులోని అసిస్టెంట్ మేనేజర్ కార్యాలయంలో గోడపత్రికను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ కార్తికమాసంలో ప్రతి శని, ఆదివారాల్లో బస్సులు తిరుగుతాయన్నారు. నవంబరు 2 నుంచి 30 వరకు 9 రోజులపాటు, డిసెంబర్ 1న ప్రత్యేక బస్సులు రాత్రి 8 గంటలకు కాకినాడలో బయల్దేరి అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామ, సామర్లకోట దర్శనం అనంతరం తర్వాత రోజు రాత్రి 8 గంటలకు చేరుకుంటాయన్నారు. ఈ సర్వీసులకు అడ్వాన్సు రిజర్వేషన్ సౌకర్యం ఉందన్నారు. బస్సులకు సరిపడా భక్తులుంటే కోరుకున్న ప్రాంతం నుంచి నడుపుతామన్నారు. శబరిమల వెళ్లే భక్తులకు అద్దె ప్రాతిపదికన బస్సులు ఇస్తామన్నారు. వివరాలకు 73829 10869, 73829 10778, 94928 33885 నంబర్లలో సంప్రదించాలన్నారు. అసిస్టెంట్ మేనేజర్ టి. బాలకృష్ణ, స్టేషన్ మేనేజర్ ఎన్. శ్రీనివాసరావు, వెంకటరాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


పంపిణీ కార్యక్రమం ప్రారంభిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

రూ.10 నాణెం చెల్లుబాటులో అపోహలొద్దు

కాకినాడ కలెక్టరేట్: రూ. 10 నాణెం చెల్లుబాటుపై ప్రజలు ఎటువంటి అపోహలకు గురికావద్దని కలెక్టర్ షాన్‌మోహన్ కోరారు. ఆర్‌బీఐ ఆదేశాల మేరకు గురువారం కలెక్టరేట్‌లో యూనియన్ బ్యాంకు నేతృత్వంలో రూ. 10 నాణెం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్ని రూ. 10 నాణాలు చెల్లుబాటు అవుతాయని, తిరస్కరిస్తే శిక్షార్హులు అవుతారని చెప్పారు. బ్యాంకర్లు ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. యూబీఐ కలెక్టరేట్ బ్రాంచి మేనేజరు అత్తిలి వెంకటసురేశ్‌కుమార్, కరెన్సీ చెస్ట్ మేనేజరు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి పక్కా ప్రణాళిక


అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ భావన

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడ నగరాభివృద్ధికి పటిష్ఠ ప్రణాళికలు అమలు చేయనున్నట్లు కమిషనర్ భావన తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం ఆమె సమీక్షించారు. ఈనెల 19న విజయవాడలో నిర్వహించనున్న పురపాలకశాఖ కమిషనర్ సమీక్షకు సిద్ధం చేసిన ప్రణాళికలపై ఆమె సమీక్షించారు. ప్రజారోగ్యం, టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్, రెవెన్యూ, సాధారణ పరిపాలనా విభాగాలకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. అదనపు కమిషనర్ సుధాకర్, ఉప కమిషనర్ మనోహర్, ఎంహెచ్‌వో పృథ్వీచరణ్, మేనేజరు శిరీష్, ఏసీపీ నాగశాస్త్రులు, తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల మంజూరుపై హర్షం


ఎమ్మెల్యే కొండబాబును అభినందిస్తున్న కార్మికులు

సాంబమూర్తినగర్, కాకినాడ నగరం: సార్టెక్స్ కార్మికుల పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మిల్లులకు అనుమతి మంజూరు చేయించిన ఎమ్మెల్యే వనమాడి కొండబాబుకు పలువురు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన స్వగృహంలో గురువారం రైస్ మిల్ ఓనర్స్, కార్మికులు మర్యాదపూర్వకంగా కలిశారు. పోర్టు ఏరియాలో సార్టెక్స్ రైసుమిల్లుల నిర్వహణకు అనుమతులు రద్దు అవ్వడంతో పనులు లేక మూడు నెలలుగా ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా పరిష్కారం లభించిందన్నారు.


వరహాలబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

బాధ్యతల స్వీకరణ

కాకినాడ కలెక్టరేట్: నగరపాలక సంస్థ అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా ఎట్టకేలకు వి. వరహాలబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా శ్రీకాకుళంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా పనిచేస్తున్న ఆయనను ఇక్కడ నియమించారు. గతనెల 22న బదిలీ ఉత్తర్వులు రాగా, ఇప్పటి వరకు చేరలేదు. ఇక్కడ ఏసీపీగా పనిచేస్తూ డీసీపీ ఇన్‌ఛార్జిగా వ్యవహరించిన కె. హరిదాసును విశాఖపట్నం మహా నగరపాలక సంస్థకు బదిలీ చేయగా, ఆయన పది రోజుల కిందటే రిలీవ్ అయ్యారు. అప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉండగా ఈయన చేరికపై చర్చ సాగింది. ఎట్టకేలకు బాధ్యతలు చేపట్టారు.

ఎస్‌ఈగా పూర్తి అదనపు బాధ్యతలు

కాకినాడ కలెక్టరేట్: నగరపాలక సంస్థ పర్యవేక్షక ఇంజినీరుగా కార్యనిర్వాహక ఇంజినీరు పి. కామేశ్వరరావుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ప్రజారోగ్య, పురపాలక శాఖ ఈఎన్‌సీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఎస్‌ఈగా పనిచేసిన పి. సత్యకుమారిని విజయవాడ నగరపాలక సంస్థకు బదిలీ చేశారు.


చెరువును తలపిస్తోన్న సురేష్‌నగర్ ఉద్యానం


సురేష్‌నగర్ బైపాస్ రహదారి


ఆర్టీసీ ప్రాంగణంలో..


భాస్కర్‌నగర్ ప్రధాన రహదారిలో ఇక్కట్లు


చినుకు... వణుకు..

సాంబమూర్తినగర్, మసీదు సెంటర్, కాకినాడ కలెక్టరేట్: వాయుగుండం కారణంగా నగరంలో గురువారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. కాలువలు నిండిపోవడంతో మురుగు రహదారిపైకి చేరింది. మురుగంతా రోడ్డుపైకి చేరింది. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మెయిన్‌రోడ్డుతో పాటు శాంతినగర్, సాంబమూర్తినగర్, వెంకట్‌నగర్, శ్రీనగర్, సినిమారోడ్డు, కొత్తపేట మార్కెట్, కొత్తకాకినాడ కూడలి, పోస్టల్‌కాలనీ, గొడారిగుంట, సురేష్‌నగర్, రేచర్లపేట తదితర ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఆర్టీసీ బస్టాండు నీట మునిగింది. బస్సులు నిలిపే ప్రదేశం, వెనుక వైపు ప్లాట్‌ఫాం వద్ద నీరు నిలిచింది. సురేష్‌నగర్, వెంకట్‌నగర్, రేచర్లపేట, ఆర్‌ఆర్‌నగర్ తదితర ప్రాంతాల్లోని ఉద్యానాల్లో నీరు నిలిచి చెరువులను తలపించాయి.

ఏళ్లుగా ముంపు సమస్య..

ప్రజలకు సేవలందించే రెడ్‌క్రాస్ భవనం ఉన్న వీధిలో వర్షం పడితే ఇబ్బందులు తప్పట్లేదు. ప్రధాన రహదారి లోతట్టుగా ఉండటంతో ముంపుబారిన పడుతోంది. రెడ్‌క్రాస్ భవనానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డును ఎత్తు చేసి, మళ్లీ నిర్మించాలని స్థానికులు, మాజీ కార్పొరేటర్, భాజపా నాయకురాలు గోడి సత్యవతి పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వంలో జరిగిన స్పందనలో అర్జీలు ఇచ్చారు. ఇంజినీర్లు పరిశీలించారు తప్ప, సమస్య మాత్రం పరిష్కారం కాలేదు.


నాగమల్లిచెట్టు ప్రాంతంలో..


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు

పారదర్శకంగా దర్యాప్తు చేయాలి

మసీదు సెంటర్, న్యూస్‌టుడే: జాతరలో జరిగిన గొడవని రాజకీయం చేయొద్దని మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. ఇందులో రాజకీయ కక్షలు లేవన్నారు. దాడి ఘటనపై పారదర్శకంగా దర్యాప్తు చేయాలని గురువారం ఎస్పీ కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. . దుమ్ములపేటలో దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా జాతరలో కొంతమంది మద్యం తాగి కొట్టుకున్నారన్నారు. దీనికి రాజకీయ రంగు పులిమే ప్రయత్నం వద్దన్నారు. అక్కడ లేని వాళ్లను పేర్లు కూడా ఎఫ్ఐఆర్‌లో పెట్టారన్నారు. వైకాపా హయాంలోనూ దుమ్ములపేట ప్రాంతంలో గొడవలు జరిగాయని, అప్పుడు 307 సెక్షన్ పెట్టలేదని, ఇప్పుడు పెట్టడం సరికాదన్నారు. ఎస్పీ లేకపోవడంతో డీఎస్పీకి వినతి పత్రం ఇచ్చామన్నారు. కాకినాడలో పార్టీ గొడవలు, పాత కక్షలు లేవన్నారు.


ధర్నాలో మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి రవి చక్రవర్తి

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

సాంబమూర్తినగర్, కాకినాడ నగరం: ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ డిమాండ్ చేసింది. జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట గురువారం యూటీఎఫ్ ఉపాధ్యాయులు ధర్నా చేశారు. యూటీఎఫ్ అధ్యక్షుడు నగేష్, ప్రధాన కార్యదర్శి టి. రవిచక్రవర్తి మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు కావస్తున్నా తమ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు వర్తించే సౌకర్యాలు, సదుపాయాలు తమకు అందట్లేదన్నారు. మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సబ్జెక్టు ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో లేరన్నారు. ఉన్నత పాఠశాలలో 3, 4, 5 తరగతులు విలీనం చేసినా, స్కూలు అసిస్టెంట్లను ఇవ్వలేదన్నారు. అర్బన్ ఎంఈవో పోస్టులు కేటాయించాలని కోరారు. డీఈవో కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. యూటీఎఫ్ జిల్లా, నగర కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

చదరంగంలో జాతీయస్థాయికి ఎంపిక


యశస్వి సత్యగంగాధర్

మసీదు సెంటర్, న్యూస్‌టుడే: ఈనెల 15 నుంచి 17 వరకు గుంటూరులో జరిగిన అండర్-15 చెస్ ఓపెన్ టోర్నమెంట్‌లో కాకినాడకు చెందిన క్రీడాకారుడు యశస్వి సత్యగంగాధర్ మొదటి స్థానంలో నిలిచాడు. నవంబరులో తమిళనాడులో జరిగే జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. కేంద్రీయ విద్యాలయంలో 10వ తరగతి చదువుతున్న యశస్వి ఇటీవల జరిగిన 53వ జాతీయస్థాయి స్పోర్ట్స్ మీట్‌లో విజేతగా నిలిచి బంగారు పతకం సాధించాడు. తండ్రి గంగాధర్ కాకినాడ ఇంటెలిజెన్స్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. తల్లి మహాలక్ష్మి గృహిణి. ఈ సందర్భంగా విద్యార్థిని పలువురు అభినందించారు.

ఎలా జీవించాలో నేర్పేదే 'రామాయణం'


వాల్మీకి చిత్రపటానికి నివాళి అర్పిస్తున డీఎంహెచ్‌వో

మసీదు సెంటర్, గాంధీనగర్, సాంబమూర్తినగర్: వాల్మీకి మహర్షి జయంతిని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డా. నరసింహానాయక్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డా. ప్రభాకర్, డా. సురేఖ, ఏవో దేవకుమారి, డెమో ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు. ● వాల్మీకి రాసిన రామాయణ కావ్యం అందరికీ ఆదర్శమని ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు పేర్కొన్నారు. లక్ష్మీనారాయణ నగర్‌లోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, తెలుగు శాఖల ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి నిర్వహించారు. మానవ మనుగడ ఎలా ఉండాలో చెప్పిన మహనీయుడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు తేజేశ్వరరావు, గౌరీప్రియ, తెలుగు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ● రామాయణ కావ్యాన్ని ప్రపంచానికి అందించిన కారణజన్ముడు వాల్మీకి అని నారా లోకేష్ అని నారా లోకేష్ యువజన ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు పేర్కొన్నారు. నివాళి అర్పించారు.

సాంబమూర్తినగర్, కాకినాడ నగరం: రామాయణం సమాజానికి ఆదర్శమని అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. వి. అనంతలక్ష్మి అన్నారు. కళాశాల సంస్కృత శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి నిర్వహించారు. ● మహాత్మాగాంధీ నగరపాలకోన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎంఈవో2 సిహెచ్. రవి, ప్రధానోపాధ్యాయుడు ఎన్ఎస్ఎస్ఎస్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'రైల్వేగేటు'తో ముప్పతిప్పలు


గేటు పడటంతో నిలిచిన వాహనాలు

నగరపాలక సంస్థ పరిధిలోని మెహర్‌నగర్ ప్రజలు ట్రాఫిక్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక ఎస్. అచ్యుతాపురం రైల్వే గేటు వద్ద వాహనాలు భారీగా నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ఇక్కడి ప్రజలు గాంధీనగర్, రామారావుపేట, కలెక్టరేట్, జడ్పీ సెంటర్, జీజీహెచ్, బాలాజీచెరువు, ఆర్డీవో, తహసీల్దారు కార్యాలయాలకు వెళ్లాలంటే రైల్వే గేటు దాటి వెళ్లాలి. రైళ్ల రద్దీ పెరగడంతో ఈ గేటు 24 గంటల వ్యవధిలో 48 సార్లు వేసి, తీస్తున్నారు. దీంతో వాహనాలు బారులు తీరుతున్నాయి. ఇక్కడ గతంలో పోలీసుబీట్ ఉండేది. వారు వాహనాలను నియంత్రించే వారు. కొన్నాళ్లుగా బీట్ తీసేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ రైల్వేగేటు వద్ద ఏర్పాటు చేసిన వన్‌వే నుంచి కొంతమేర సవరించారు. విభాగినులు మార్పు చేశారు. ఇది కూడా ట్రాఫిక్ సమస్యకు హేతువుగా నిలుస్తోంది. ఈ సమస్యలను పరిష్కరించాలని, పోలీసుబీటు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. రైల్వేగేటుకు వెళ్లే మార్గంలో కల్వర్టు దెబ్బతింది. రహదారిలో గుంతలు ఏర్పడ్డాయి. వీటిని బాగు చేయాలని నగరపాలక అధికారులను వేడుకుంటున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్**

ద్వేషం, అజ్ఞానం వీడితేనే పరిపూర్ణత


మాట్లాడుతున్న డాక్టర్ కె.బాబ్జీ, చిత్రంలో ఆంధ్ర అనాలయో

కాకినాడ కలెక్టరేట్: రాగద్వేషం, మోహం, అజ్ఞానం వీడితేనే మనిషి పరిపూర్ణుడు అవుతాడని ఆంధ్ర అనాలయో పేర్కొన్నారు. గురువారం ఎస్. అచ్యుతాపురంలోని అంబేడ్కర్ బుద్ధ విహార్‌లో ఆశ్వయుజ పౌర్ణమి, కఠిన చీవరదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రవచనం చేశారు. బుద్ధుడు చెప్పినట్లుగా ధ్యాన భావనా ప్రక్రియ, శీలాచరణ శాస్త్రీయపై అవగాహన ఉండాలన్నారు. బౌద్ధ సంస్కృతి ప్రకారం బౌద్ధ భిక్షువులకు వస్త్రదానం చేశారు. ఎన్టీఆర్ హెల్త్‌వర్సిటీ మాజీ ఉపకులపతి డాక్టర్ కె. బాబ్జీ మాట్లాడారు. నేలపూడి పెద్దిరాజు, డి. వెంకటరావు, ఎన్. సరోజిని, డాక్టర్ కె. రామారావు, పి. రాంప్రసాద్, డాక్టర్ ఎం. పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ.60 వేలు జరిమానా

మసీదు సెంటర్: ట్రాఫిక్-1,2 విభాగ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఎనిమిది మందిపై కేసులు నమోదు చేశామని సీఐలు ఎన్. రమేష్, డి. రామారావు తెలిపారు. ఇద్దరికి రెండు రోజుల జైలు, ఆరు మందికి ఒక్కొక్కరికి రూ. 10 వేలు చొప్పున జరిమానా విధించారన్నారు. కాకినాడ మూడో అదనపు సెకెండ్ క్లాస్ జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి వి. నరసింహారావు తీర్పు చెప్పినట్లు వివరించారు.

గుండెపోటుతో మున్సిపల్ ఉద్యోగి మృతి

కాకినాడ కలెక్టరేట్: నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగంలో పనిచేస్తున్న ఆఫీసు సబార్డినేట్ డి. అన్నవరం గురువారం గుండెపోటుతో మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బ్యాంకుపేటలోని స్వగృహం వద్ద మున్సిపల్ ఉద్యోగులు సందర్శించి, శ్రద్ధాంజలి ఘటించారు. సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది సంతాపం తెలిపారు.

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

అమ్మవారి జాతర.. ఊరేగింపు

సామర్లకోట: విజయదశమి ఉత్సవాల ముగింపు పురస్కరించుకుని స్థానిక పాతబస్‌డిపోలో అమ్మవారి జాతర ఊరేగింపు కార్యక్రమాన్ని ఉత్సవ కమిటీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం అమ్మవారిని ప్రత్యేక వాహనంలో కొలువుదీర్చి పూజలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ మాజీ ఛైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, నాయకులు లక్ష్మీనారాయణ హాజరయ్యారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నాయకులు కృష్ణ, ప్రసాద్, శివాజీ, ఉమామహేశ్వరరావు, విజయ్, రామకృష్ణ, రాజు, త్రిమూర్తులు, అజయ్, నారాయణ పాల్గొన్నారు.


సన్నిధిలో రాజేశ్వరి

మద్యం దుకాణం పెడితే అడ్డుకుంటాం

పెదపూడి, న్యూస్‌టుడే: పెదపూడి గ్రామానికి చెందిన మద్యం దుకాణం క్రైస్తవ సెంటరులో ఏర్పాటు చేస్తే అడ్డుకుంటామని సీపీఐ న్యూడెమోక్రసీ, భారత కార్మిక సంఘాల సమాఖ్య నాయకుడు గుబ్బల ఆదినారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రాంతంలో రోడ్డు పక్కనే మద్యం దుకాణం నిర్మిస్తే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. ఈ సమీపాన వీరభద్ర స్వామి ఆలయం, కొంచెం దూరంలోనే ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయన్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో మద్యం దుకాణ నిర్మాణ పనుల అనుమతులు ఇవ్వకూడదని, అలా ఇస్తే నిలుపుదల చేయడానికి పోరాటం చేస్తామని డిమాండ్ చేశారు.

కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించండి

సామర్లకోట: కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలందించాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కోరారు. గురువారం సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రిలో అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం సూపరింటెండెంట్ అమల ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే చినరాజప్ప, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి, భాజపా నియోజకవర్గ కన్వీనర్ చిత్తాల వెంకటరమణ హాజరయ్యారు. కమిటీ సభ్యులు అభివృద్ధికి కృషి చేయాలన్నారు. డాక్టర్ అమల మాట్లాడారు. సభ్యులుగా రామలక్ష్మి, దుర్గాప్రసాద్, చంద్రశేఖర్‌లతో ప్రమాణ స్వీకారం చేయించారు. కుమారస్వామి, శ్రీకాంత్, రవిచంద్రప్రసాద్, జగదీష్‌మోహన్, దొరబాబు, వాసు, జానకీరామారావు, సాయిబాబు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప

తీరం.. ఆవాసదూరం

– న్యూస్‌టుడే, కొత్తపల్లి

యు.కొత్తపల్లి మండలంలోని గంగపుత్రులకు సముద్రమే జీవనాధారం. సముద్రంలోకి వేటకువెళ్లి లభించిన మత్స్యసంపదతోనే కుటుంబాలను పోషించుకుంటారు. అలాంటి సముద్రం కారణంగా మత్స్యకారుల కుటుంబాలు నిరాశ్రయులుగా మారుతున్నాయని వాపోతున్నారు. తుపాను హెచ్చరికలు జారీచేస్తే తీర ప్రాంత వాసుల గుండెల్లో గుబులు పుడుతుంది. ఏ సమయంలో సముద్రం అల్లకల్లోలంగా మారి వారిని ముంచెత్తుతుందోనని భయాందోళన చెందుతారు. ప్రతి తుపాను సమయంలో తీరంలో ప్రభావిత గ్రామాలైన ఉప్పాడ, జగ్గరాజుపేట, సూరాడపేట, మాయపట్నం, కొనపాపపేట గ్రామాల్లో పదుల సంఖ్యలో ఇళ్లు కోతకుగురై సముద్ర గర్భంలో కలిసిపోతున్నాయి. పదిహేనేళ్ల క్రితం నిర్మించిన జియో ట్యూబ్ కుసుదుగవడంతో అయిదేళ్లుగా కోత సమస్య తీర ప్రాంత గ్రామాలను వెంటాడుతోంది. గడిచిన అయిదేళ్లలో 200 మీటర్ల పైబడి గ్రామాలు సముద్రంలో కలిసిపోయాయి. గృహాలు కోల్పోయిన బాధిత కుటుంబాలు పరాయి పంచన జీవించాల్సివస్తోంది. సముద్ర కోతకు అడ్డుకట్ట వేసేవరకు వారికి ఈ బాధలు తప్పవు.

● రెండు రోజులుగా తుపాను ప్రభావం యు.కొత్తపల్లి మండలంలోని తీర ప్రాంత గ్రామాలను అతలాకుతలం చేస్తోంది. భారీ అలలు ఉవ్వెత్తున ఎగసి గ్రామాల్లో పడటంతో సుమారు పది ఇళ్లు నేలకూలాయి. మరోకొన్ని ఇళ్లు పాక్షికంగా దెబ్బతిని ప్రమాదకరంగా మారి కూలేలా ఉన్నాయి. విద్యుత్తు స్తంభాలు కూలిపోవడంతో రెండు రోజులుగా విద్యుత్తు సరఫరాకు అంతరాయంతో చీకట్లో గడుపుతున్నారు. గత వైకాపా ప్రభుత్వంలో వారికి అనుకూలంగా ఉన్నవారికే ఇళ్ల స్థలాలు ఇచ్చారని, సముద్రం ఒడ్డున ఉంటున్న తమకు మాత్రం ఇవ్వలేదని ఇక్కడివారు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వంలో అర్హులైన అందరికీ ఇళ్లస్థలాలు కేటాయించాలని, కోత నివారణ, రక్షణ కల్పించాలని కోరుతున్నారు.


బుధవారం అర్ధరాత్రి దెబ్బతిన్న గోడ


కెరటాల తీవ్రతకు ఉప్పాడలో దెబ్బతిన్న ఇళ్లు

ఇంటి దగ్గరకొచ్చేసింది



గతంలో సముద్రం మా ఇంటికి కనుచూపు దూరంలో ఉండేది. ఇటీవల వరుస తుపానుల కారణంగా సముద్రం గ్రామాన్ని కబళిస్తోంది. ప్రస్తుతం మా ఇంటి వద్దకు వచ్చేసింది. త్వరలో నా ఇల్లు కూడా సముద్రంలో కలిసిపోవడానికి సిద్ధంగా ఉంది. రెండు రోజులుగా ఇబ్బందులుపడుతున్నా ఎవరూ పట్టించుకోలేదు.

- సుబ్బలక్ష్మి, ఉప్పాడ

కుటుంబాలు రోడ్డున..



రెండు రోజులుగా సముద్ర కెరటాల ప్రభావానికి మా ఇల్లు రాత్రికి రాత్రే కూలిపోయింది. ఒకే ఇంటిలో మూడు కుటుంబాలవారం జీవనం సాగించేవాళ్లం. ఇప్పుడు అందరం రోడ్డున పడ్డాం. ఎవరూ అద్దెకు ఇల్లు ఇవ్వడం లేదు. ఎక్కడ ఉండాలో కూడా తెలియడం లేదు. మమ్మల్ని ప్రభుత్వమే ఆదుకోవాలి.

- బండియ్య, ఉప్పాడ

బాధితులకు సత్వర న్యాయం జరగాలి

కరప: ప్రజా సమస్యలపై వెంటనే స్పందిస్తూ బాధితులకు సత్వర న్యాయం జరిగేలా సిబ్బంది కృషి చేయాలని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ సూచించారు. కరప పోలీసుస్టేషన్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బంది పని తీరు, రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్సై టి.సునీత, ఏఎస్సై ప్రసన్నకుమార్, హెచ్‌సీ మునాఫ్, రైటర్లు సురేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

కరప: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని పీడీ సీహెచ్ కృష్ణ సూచించారు. వేళంగిలో గురువారం కాకినాడ గ్రామీణ నియోజకవర్గ స్థాయి అథ్లెటిక్ పోటీలు నిర్వహించారు. మండలానికి చెందిన భగవాన్, అభిరామ్, దుర్గాప్రసాద్, రాంబాబు, వీరమణికంఠ స్వామి, మనీషా, వీరేంద్ర, ప్రవీణజోష్, వీరదుర్గ, సాయిరితిక, వరలక్ష్మి, లక్ష్మీదీప్తి, సాయిసుధ ప్రతిభ చాటారు. ఈ నెల 24 నుంచి జరిగే జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచి ఎస్.నీలిమ, పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ మెర్ల వీరయ్యచౌదరి, హెచ్‌ఎం భారతి, డా.బొండా వెంకన్నరావు తదితరులు విద్యార్థులను అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న ప్రతినిధులు

రేపటి నుంచి రీ సర్వేపై గ్రామసభలు

కాజులూరు: రీ సర్వేలో ఇబ్బందులు తొలగించేందుకు శనివారం నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు శివకుమార్ గురువారం తెలిపారు. జగన్నాథగిరి సచివాలయం వద్ద ఉంటుందన్నారు.

రోజంతా వాన.. లోతట్టు జలమయం

పిఠాపురం: పిఠాపురం నియోజకవర్గంలో రోజంతా వర్షం కురిసింది. గొల్లప్రోలులోని లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పిఠాపురం పట్టణం, మండలంలో కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రథాలపేట సెంటర్, ఉప్పాడ సెంటర్, జగ్గయ్యచెరువు, అగ్రహారం ప్రాంతాల్లో బాగా ఇబ్బందులు తలెత్తాయి. ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ పాఠశాల ఆవరణలో నీరు నిలిచి విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణంతా ఛిద్రంగా మారింది.

సంక్రాంతికి ముందే పల్లెల్లో పండగ

సర్పవరం(సర్పవరం జంక్షన్), కొత్తపల్లి, పెద్దాపురం : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కృషితో గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఎన్‌డీఏ ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో సంక్రాంతికి ముందే పల్లెల్లో పండగ వాతావరణం నెలకొందని ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. సర్పవరం, తూరంగి, కొవ్వూరు, కొవ్వాడ, రేపూరు గ్రామాల్లో రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పనకు ఎమ్మెల్యే నానాజీ, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు శంకుస్థాపన చేశారు. ఎంపీడీవో పి.సతీష్, శ్రీనివాసబాబా, ఏసుదాసు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు. ● మాజీ ఎమ్మెల్యే వర్మ యు.కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రారంభంలో ఆయనతోపాటు జనసేన ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు. ● పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప గురువారం కాండ్రకోట, గోరింట, వడ్లమూరు గ్రామాల్లో సీసీ రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. డ్వామా పీడీ వెంకటలక్ష్మి, ఎంపీడీవో శ్రీలలిత, కొత్తెం శ్రీనివాసరావు, పచ్చిపాల సత్తిబాబు, ఎలిశెట్టి నాని, దేవళ్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నానాజీ, చిక్కాల

జీవ ఎరువులతో అధిక దిగుబడులు

కాజులూరు: జీవఎరువుల వినియోగంతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని కాకినాడ జిల్లా సంయుక్త వ్యవసాయాధికారి విజయ్‌కుమార్ తెలిపారు. గురువారం శీల గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. సర్పంచి వెంకటరమణ, కరప డివిజన్ ఏడీఏ బాబూరావు, ఏవో అశోక్ పాల్గొన్నారు.

గొల్లప్రోలు: వరి పంటలో ఆకుముడత, దోమపోటుతోపాటు ఎలుకల బెడద నివారణకు రైతులు చర్యలు చేపట్టాలని పెద్దాపురంలోని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఆయ్యాల సోమయాజుల సీతారామశర్మ సూచించారు. తాటిపర్తిలో వ్యవసాయ కళాశాల విద్యార్థులతో కలిసి పంట పొలాలను గురువారం పరిశీలించారు. ఉద్యాన అధికారి గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా అమ్మవారి దర్శనం

సర్పవరం జంక్షన్: కాకినాడ గ్రామీణం కొవ్వూరులోని భువనేశ్వరి అమ్మవారు గురువారం శాకంబరిగా దర్శనమిచ్చారు. అర్చకులు శర్మ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

సోమేశ్వరాలయంలో లక్షపత్రి పూజలు

పెదపూడి: పెదపూడి శ్రీ శ్యామలాంబ సమేత సోమేశ్వరాలయంలో గురువారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామున లక్షపత్రి పూజ జరిపారు.

పాలసీ బోనస్ పెంచాలని వినతి

పిఠాపురం: ఎల్ఐసీ ఏజెంట్లకు చెల్లించే పాలసీ బోనస్ పెంచాలని ఆ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు లోకారెడ్డి రామకృష్ణ, కేవీవీ సత్యనారాయణ కోరారు. వారి సమస్యల పరిష్కారానికి చేపట్టిన ఆందోళన గురువారం 9వ రోజుకు చేరుకుంది. ఏజెంట్ల మనుగడ దెబ్బతీసేలా సంస్థ వ్యవహరిస్తోందని ఆరోపించారు. పాలసీపై జీఎస్టీ రద్దు చేయాలని, పాత పద్ధతినే కొనసాగించాలన్నారు. అన్ని పాలసీలకు సంబంధించి ఏజెంట్ల కమిషన్లు పాత విధానంలోనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పరిష్కారానికి సంస్థ చర్యలు చేపట్టకుంటే, ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు. నాయకులు కె.రాంబాబు, పండు రాఘవులు, పిలమేరు రాజబాబు, నాగరాజు, ప్రసాద్, చింత అప్పారావు, ఉడతా రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలు

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: రైతులకు ప్రకటించిన మద్దతు ధర లభించేలా నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలు నిర్వహించాలని మండల వ్యవసాయశాఖ అధికారి సత్యనారాయణ, తహసీల్దారు సత్యనారాయణ సిబ్బందిని ఆదేశించారు. ఆ మేరకు సిబ్బందికి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సాయంత్రం శిక్షణ నిర్వహించారు. రిసోర్స్‌పర్సన్లు కిశోర్, సురేష్, సత్యస్రవంతి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమస్య: పెద్దాపురం పట్టణంలోని కాండ్రకోట మార్గం దర్గా పక్కన కాలువలు లేక మురుగు దారిలోనే పారుతోంది.

- సుబ్రహ్మణ్యం, పెద్దాపురం

సమాధానం: ఇంజినీరింగ్ సిబ్బందితో అంచనాలు తయారు చేసి పాలకవర్గ ఆమోదంతో కలువలు నిర్మిస్తాం. - కేవీ పద్మావతి, కమిషనర్, పెద్దాపురం

సమస్య: రమణయ్యపేట పంచాయతీ సిద్ధార్థనగర్‌లో మురుగు కాలువల సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నాం. - అప్పలరాజు

సమాధానం: వెంటనే పరిశీలించి నిధుల లభ్యతను బట్టి సమస్యను పరిష్కరిస్తాం.

- నరసింహారావు, పంచాయతీ కార్యదర్శి

– న్యూస్‌టుడే, పెద్దాపురం, రమణయ్యపేట(సర్పవరం జంక్షన్)

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:	
కాకినాడ గ్రామీణం:	80085 74325
పెద్దాపురం:	80085 74198
పిఠాపురం:	80085 65544

మార్గం.. మళ్లీ జలమయం

గొల్లప్రోలులోని జగనన్నకాలనీకి వెళ్లే మార్గంలో మళ్లీ వరద నీరు చేరింది. ప్రస్తుత భారీ వర్షాలతోపాటు ఎగువ ప్రాంతాల నుంచి అధికంగా చేరుతున్న నీటితో సుద్దగడ్డ ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. జగనన్నకాలనీ మార్గంలో ప్రవహిస్తున్న వరద నీటిలోంచే విద్యార్థులు, ప్రజలు గురువారం రాకపోకలు సాగించారు. గొల్లప్రోలు నుంచి సూరంపేటకు వెళ్లే మార్గంలోనూ నీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. జగనన్నకాలనీ, సూరంపేట మార్గాల్లో నీరు ప్రవహించడం ఇది ఆరోసారని స్థానికులు చెబుతున్నారు. చిన్నపాటి వర్షానికే మార్గం ముంపునకుగురై ఇబ్బందిపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గొల్లప్రోలు నుంచి తాటిపర్తి వెళ్లే పుంతరోడ్డుపైనా వరదనీరు ప్రవహిస్తోందని వాపోతున్నారు.

– న్యూస్‌టుడే, గొల్లప్రోలు


నీటిలోంచే రాకపోకలు సాగిస్తున్న విద్యార్థులు, ప్రజలు

గుంతలు.. గుబులు

కొత్తపల్లి, న్యూస్‌టుడే: ఉప్పాడ నుంచి పిఠాపురం వరకున్న పది కిలోమీటర్ల రహదారిలో భారీగా గోతులు ఏర్పడ్డాయి. యు.కొత్తపల్లి మండలానికి ఇదే ప్రధాన రహదారి. ఒకప్పుడు చిన్నగా ఉన్న గోతులు ప్రస్తుతం పెద్దవై ప్రమాదకరంగా మారాయి. మండలం నుంచి నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. చాలామంది ప్రమాదాలకు గురవుతున్నారు. కొండెవరం, పిఠాపురం రైల్వేగేటు, యండపల్లి జంక్షన్, నవఖండ్రవాడ ప్రాంతాల్లో ఈ దారి అధ్వానంగా మారింది. రాత్రి సమయంలో వీటిని గుర్తించలేకపోతున్నారు. దీనిపై ర.భ.శాఖ ఏఈ లోవరాజును అడుగగా రహదారి మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయని, ప్రస్తుతం టెండర్ల ప్రక్రియ జరుగుతోందన్నారు. త్వరలోనే మరమ్మతులు నిర్వహిస్తామని తెలిపారు.


కొండెవరంలో రహదారి మధ్యలో భారీ గుంతలు


పిఠాపురం రైల్వేగేటు వద్ద ఇలా..

శివారు కాలనీ.. రేషన్ అందదెందుకనీ..!

వాలుతిమ్మాపురం దారిలోని టిడ్కో కాలనీలో 800 కుటుంబాలు ఉంటున్నాయి. వీరు నెలనెలా రేషన్ పొందాలంటే మూడు కిలోమీటర్ల దూరంలోని పట్టణానికి వచ్చి తీసుకోవాల్సిందే. జగ్గంపేట రహదారిలోని ఎన్టీఆర్ కాలనీకి వాహనం వస్తుందని, తమకు ఆ సౌకర్యం లేకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చలేదని వాపోతున్నారు. సమస్యపై అడుగగా కాలనీలో రేషన్ దుకాణం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దారు వెంకటలక్ష్మి తెలిపారు.

– న్యూస్‌టుడే, పెద్దాపురం


వాలుతిమ్మాపురం దారిలో టిడ్కో గృహాలు

వ్యర్థాలు తొలగించండి సారూ!

కోరింగ పంచాయతీ సీతారామపురం గుడ్డివానితూము కూడలిలో ఉన్న మురుగు కాలువ చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. కాలువకు ఇరువైపులా ఉన్న రొయ్యల శుద్ధి కంపెనీల నుంచి వ్యర్థాల నీరు ఇక్కడ చేరడంతో దుర్గంధం భరించలేకున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో మురుగు ముందుకు పారకుండా నిలిచిపోయిందని, తక్షణమే కాలువలో చెత్తను తొలగించి శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి విజెవి రమణను వివరణ కోరగా కాలువను శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, తాళ్లరేవు


సీతారామపురం కాలువలో పేరుకుపోయిన చెత్త

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

సామర్లకోట: సామర్లకోట మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ప్రభాకర్ గురువారం తెలిపారు. వేట్లపాలెం, జి.మేడపాడు, హుస్సేన్‌పురం, మాధవపట్నం, వీకేరాయపురం, సత్యవరపుపేట, బోయినపూడి, ఉండూరు, గొంచాల, పి.వేమవారం, కాపవరం, నవర, చంద్రపాలెం, పవర గ్రామాలవారు సహకరించాలని కోరారు.

శ్రీకృష్ణదేవరాయలు జయంతి వేడుకలు

సర్పవరం జంక్షన్: కాకినాడలోని స్టేడియం రోడ్డులో శ్రీకృష్ణదేవరాయలు జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహం వద్ద గురువారం కాకినాడ గ్రామీణ, నగర ఎమ్మెల్యేలు పంతం నానాజీ, వనమాడి వెంకటేశ్వరరావు, ఆంధ్ర కాపు సద్భావన సంఘం నాయకులు నివాళి అర్పించారు. ఏసుదాసు, ప్రభాకరరావు, శ్రీనివాస్, పట్టాభిరామయ్య పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో కంప్యూటర్ విద్య

– న్యూస్‌టుడే, గొల్లప్రోలు

గొల్లప్రోలులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు కంప్యూటరు విద్య అందుబాటులోకి వచ్చింది. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కార్యాలయ అధికారుల బృందం పర్యటన సందర్భంగా కళాశాలలో కంప్యూటర్లు లేక విద్యార్థులకు సైన్సు శిక్షణ అందించేందుకు ఇబ్బందిగా మారిన విషయాన్ని గుర్తించి నివేదిక అందించారు. సమస్యను తెలుసుకున్న పవన్‌కల్యాణ్ వెంటనే కళాశాలకు అవసరమైన కంప్యూటర్లు అందించాలని కలెక్టరుకు ఆదేశాలు జారీ చేశారు. గొల్లప్రోలులోని ఎమ్మార్సీ కేంద్రానికి సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.1.10 లక్షలతో కొనుగోలు చేసిన రెండు కంప్యూటర్లను కళాశాలకు అందించారు. దీంతో కళాశాల విద్యార్థులు కంప్యూటర్ సైన్స్ శిక్షణను గురువారం నుంచే ప్రారంభించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చదువుకునే పరిస్థితులు ఉండేలా చూడాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఎక్స్(ట్విట్టర్)లో పోస్టు చేశారు. ● తాటిపర్తి జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు స్తంభాలను అధికారులు తొలగించారు. పాఠశాల మైదానంలో ఉన్న విద్యుత్తు స్తంభాల కారణంగా ఆటలాడుకునేందుకు విద్యార్థులు ఇబ్బందికరంగా మారడమే కాకుండా ప్రమాదాలకు ఆస్కారం ఉందని అధికారుల ద్వారా పవన్‌కల్యాణ్ దృష్టికి వెళ్లడంతో అధికారులను ఆదేశించారు. దీంతో స్తంభాలను తొలగించి వేరేచోట ఏర్పాటు చేశారు. ఉపముఖ్యమంత్రికి, అధికారులకు విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.


జూనియర్ కళాశాలలో శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

వాల్మీకి మహర్షి జయంతి

పెద్దాపురం: పెద్దాపురంలోని ఆయా కార్యాలయాల్లో ఆర్డీవో శ్రీరమణి, పురపాలిక ఛైర్‌పర్సన్ బొడ్డు తులసీమంగతాయారు, శాఖా గ్రంథాలయంలో అధికారి పాలంకి నాగరాజు గురువారం వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కమిషనర్ కేవీ పద్మావతి పాల్గొన్నారు.

సర్పవరం(సర్పవరం జంక్షన్): సర్పవరంలోని భవానీ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న సప్తరుషి మండలంలో గురువారం ఎస్ఎఫ్‌సీఎల్ మూర్తి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో వాల్మీకి మహర్షి జయంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి పంచామృత అభిషేకాలు, పూజలు, మంత్రపుష్పం, నీరాజన కార్యక్రమాలు నిర్వహించారు. వేణునాదం, భీమశంకరరావు, సుబ్బారావు, వేదుల ఫణీంద్రయోగి తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు: గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో వాల్మీకి జయంతి వేడుకలు గురువారం నిర్వహించారు. ఎంపీడీవో స్వప్న, అరిగెల రామయ్యదొర, ఈవోపీఆర్డీ కుమార్, రామలక్ష్మి తదితరులు నివాళి అర్పించారు.


నివాళి అర్పిస్తున్న ఆర్డీవో శ్రీరమణి తదితరులు

పెదపూడి: పెదపూడిలో ఎంపీడీవో కె.నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు గురువారం నిర్వహించారు. ఈవోపీఆర్డీ సత్యనారాయణరెడ్డి, పరిపాలనాధికారి శ్రీనివాసరావు, ఎంఈవో సత్యనారాయణ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థి ఔదార్యం.. సౌకర్యం

పిఠాపురం పట్టణంలోని ఆంధ్రకేసరి ప్రకాశం మున్సిపల్ పాఠశాలలో 1979-80లో పదో తరగతి చదివిన ర్యాలీ రవి పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇటీవల రూ.3 లక్షలతో డైనింగ్, స్టడీ హాల్ నిర్మించారు. ఈయన ప్రస్తుతం హైదరాబాదులోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీ నిర్వహిస్తున్నారు. ఆయన చదువుకున్న పాఠశాలకు, అక్కడ చదువుతున్న విద్యార్థులు ఏదో ఒక సాయం చేయాలనే ఉద్దేశంతో ఈ హాల్ నిర్మించారు. స్నేహితుల సహకారంతో పాఠశాల అవసరాలు తీర్చేందుకు మరింత కృషి చేస్తానని చెబుతున్నారు.

– న్యూస్‌టుడే, పిఠాపురం


పాఠశాలలో నిర్మించిన డైనింగ్, స్టడీ హాల్

వాయుగుండం.. అన్నదాతల్లో కలవరం

పిఠాపురం, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావానికి మూడు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఉరుములు, మెరుపులతోపాటు ఈదురుగాలుల ప్రభావానికి అన్నదాతల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటికే తీర ప్రాంతం కోతకు గురవుతుండగా, ఆ ప్రభావానికి పంటలకు కూడా నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.

● పిఠాపురం నియోజకవర్గంలో 17 వేల హెక్టార్లలో వరి పంట సాగవుతోంది. ప్రస్తుతం పంటంతా ఈనిక దశలో ఉంది. ఆగస్టు మొదటి వారం, సెప్టెంబరు పదో తేదీ వరకు కురిసిన వర్షాలు, వరదలకు 18 వేల ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లింది. 43 ఎకరాల్లో ఇసుక మేటలు వేసింది. మరోపక్క కాలువలకు భారీగా గండ్లు పడడంతో వాటి పూడ్చివేతకు రూ.80 లక్షల వరకు మంజూరు చేశారు. వరదలకు నష్టపోయిన పంటను రసాయన ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేసి రక్షించుకున్నారు. ఇప్పుడిప్పుడే పంటలు కళకళలాడుతున్నాయి. ఈ నేపథ్యంలో అల్పపీడన ప్రభావానికి పగలు, రాత్రి తేడా లేకుండా వర్షాలు కురుస్తున్నాయి, గాలులు వీస్తున్నాయి. దాంతో పంట నేలవాలడం, తెగుళ్ల వ్యాప్తిచెందే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే ఎకరాకు రూ.30 వేల వరకు రైతులు పెట్టుబడి పెట్టేశారు. మరి కొందరు కౌలుకు మరో రూ.20 వేలు అదనంగా చెల్లించారు. ఈ సమయంలో ఏమాత్రం పంటలు దెబ్బతిన్నా రైతులకు భారీ నష్టం చేకూరేలా ఉండడంతో వరుణుడికి భయపడిపోతున్నారు. వాతావరణ శాఖ హెచ్చరికలతో మరింత కలవరపడుతున్నారు. గతేడాది ఖరీఫ్, దాళ్వా సాగు సమయంలో కూడా అకాల వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. వరదల కారణంగా ఈ ప్రాంతంలో ఏలేరు ప్రాజెక్టు నుంచి అధికంగా నీరు విడుదల చేస్తే కాలువ గట్లు బలహీనంగా ఉన్నచోట్ల నుంచి పొలాల్లోకి నీరుచేరి ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. భారీ వర్షాల కారణంగా ఏక్షణానైనా పంటలు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు.


జల్లూరులో ఎండాకు తెగులు సోకిన వరి పంట

ఇప్పటికే తెగుళ్ల వ్యాప్తి..

పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో బయో సాంబ రకం వరి పంటకు ఎండాకు తెగులు వ్యాపిస్తోంది. గాలి రాపిడికి కూడా ఈ తెగులు పక్క పొలాలకు విస్తరిస్తోంది. దీనిని నివారించుకునేందుకు పదిరోజులుగా రైతులు అదనపు పెట్టుబడులు పెడుతున్నారు. మరో పక్క ఎలుకల దాడి ఎక్కువైంది. సుడి దోమ ఆశిస్తున్నట్లు వ్యవసాయాధికారులు గుర్తించారు. పత్తిపంటకు కూడా తెగుళ్లు వ్యాపిస్తున్నాయి.

అప్రమత్తంగా ఉండాలి

తుపాను ప్రభావానికి ప్రస్తుతం ఎలాంటి ఇబ్బంది లేదు. వర్షాలు విస్తారంగా కురిస్తే పొలాల్లో నీరు కిందికిపోయే మార్గం ఏర్పాటు చేసుకోవాలి. సూచనలు పాటిస్తుండాలి. తెగుళ్ల నివారణకు రైతులతో రసాయన ఎరువులు పిచికారీ చేయిస్తున్నాం. దోమ, ఎలుకల నివారణకు చర్యలు చేపట్టాం.

- అచ్యుతరావు, మండల వ్యవసాయాధికారి

పార్టీ బలోపేతానికి కృషి

కొత్తపల్లి: ప్రతిఒక్కరూ భాజపా బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి రావూరి లక్ష్మణ్‌స్వామి కోరారు. గురువారం కొత్తపల్లి, కుతుకుడుమిల్లి గ్రామాల్లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. నియోజకవర్గ కన్వీనర్ కృష్ణంరాజు, డి.వి.ఎస్.రాజు, కొండలరావు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలు

గొల్లప్రోలు: మేకలు, గొర్రెల్లో నట్టల నివారణకు గ్రామాల వారీగా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి మందు పంపిణీ చేస్తున్నట్లు పశుసంవర్ధకశాఖ డీడీ అంబేడ్కర్ తెలిపారు. చేబ్రోలులో మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందు పంపిణీ శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. నట్టల నివారణ చర్యల ద్వారా గొర్రెలు, మేకల్లో త్వరితగతిన పెరుగుదల కనిపిస్తుందన్నారు. ఆర్.హిమజ, సిబ్బంది పాల్గొన్నారు.

తుని
•తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

అట్టహాసంగా పల్లెపండగ

శంఖవరం, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. కత్తిపూడి మండలం కొండవారిపేటలో గురువారం నిర్వహించిన 'పల్లె పండగ'లో భాగంగా సీసీ రహదారులకు ఆమె శంకుస్థాపన చేశారు. మండలానికి రూ.1.70 కోట్ల నిధులు మంజూరయ్యాయని, కత్తిపూడి గ్రామానికే రూ.30 లక్షలు మంజూరు చేశామన్నారు. అంతకుముందు శంఖవరం, వజ్రకూటం, సీతంపేట, జి.కొత్తపల్లి, గౌవరంపేట గ్రామాల్లో స్థానిక నాయకులు పర్వత సురేష్, బద్ది రామారావు, కీర్తి వెంకట సుభాష్ తదితరులతో కలిసి శంకుస్థాపనలు చేశారు. కత్తిపూడి మారుతీనగర్ వాసులు ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలు తీసుకురాగా దశల వారీగా సమస్యలు పరిష్కరిస్తామని హామీ నిచ్చారు. టిఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెన్నా ఈశ్వరుడు, ఎంపీడీవో శర్మ, జనసేన నాయకులు మేడిశెట్టి సూర్యకిరణ్ తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

మండల సర్వసభ్య సమావేశం

గండేపల్లి(జగ్గంపేట): జగ్గంపేట ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను ముందుకు తీసుకెళ్తూ గ్రామాల్లో అభివృద్ధి పనులు, సమస్యలపై దృష్టి సారించాలని తెలిపారు. గ్రామంలో పారిశుద్ధ్యం, తాగు నీటిపై దృష్టి సారించాలన్నారు.

కడలి కల్లోలం



తొండంగి, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం కారణంగా గురువారం ఉదయం నుంచి అడపాదడపా ఉరుములతో కూడిన వర్షం కురిసింది. అద్దరిపేట నుంచి పెరుమాళ్లపురం వరకు ఉన్న సముద్ర తీరంలో అలలు ఎగసిపడ్డాయి. తుపాను ప్రభావం తగ్గే వరకు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని ఎఫ్‌డీవో ఉమామహేశ్వరరావు మత్స్యకార గ్రామాల్లో టాంటాం వేయించారు. దీంతో పడవలు ఒడ్డుకు చేరాయి.

కూటమి ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధి

గండేపల్లి, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం అయిదేళ్లు గ్రామాల అభివృద్ధిని విస్మరించిందని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. గురువారం గండేపల్లి మండలంలో పల్లెపండగ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ అయిదేళ్లల్లో నియోజకవర్గంలో ప్రతీ మట్టిరోడ్డు సీసీ రోడ్డుగా మారుతుందన్నారు. తాళ్లూరులో రూ.40 లక్షలు, నీలాద్రిరావుపేటలో రూ.40 లక్షలు, జడ్.రాగంపేటలో రూ.10 లక్షలు, పి.నాయకంపల్లిలో రూ.15 లక్షలు, యల్లమిల్లిలో రూ.40 లక్షల ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ తెదేపా నాయకులు కోర్పు లచ్చయ్యదొర, పోతుల మోహనరావు, కందుల చిట్టిబాబు, కూరుకూరి చౌదరి, కందుల బాబ్జి, కుంచే రాజా, జాస్తీ వసంత్, కంటే సురేంద్ర, ఎంపీడీవో నాతి బుజ్జి, తహసీల్దారు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ సుజల పథకం ప్రారంభం

గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట గ్రామంలో గురువారం ఎన్టీఆర్ సుజల పథకాన్ని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జనసేన ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్‌లు గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పద్మ ఇండస్ట్రీస్ అధినేత కంచర్ల శ్రీనివాస్ రూ.రెండు లక్షల నిధులతో ఆర్వోప్లాంట్ సిద్ధం చేశారని, ఇటువంటి సేవా కార్యక్రమాలతో ముందుకు సాగాలని అభినందించారు. గ్రామ తెదేపా నాయకులు కురుకూరి చౌదరి, రమేష్, విజయ్, వినయ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచితంగా డీఎస్సీ కోచింగ్ ..

జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి జగ్గంపేటలోని కాపు కల్యాణ మండపంలో ఉచిత డీఎస్సీ కోచింగ్ ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. ఇప్పటికే సుమారు 60 రోజుల పాటు బీఈడీ, ఎస్‌జీటీ అభ్యర్థులకు రాష్ట్రస్థాయి అధ్యాపకులతో ఉచిత టెట్ కోచింగ్ ఇచామన్నారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కోరారు.



నీలాద్రిరావుపేట శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే నెహ్రూ, తుమ్మలపల్లి రమేష్

పుస్తకాలు, మొక్కలతో రండి

తనను అభిమానించే ప్రతీ ఒక్కరూ తన పుట్టిన రోజున పూలదండలు, బోకేలు తీసుకురావద్దని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సూచించారు. తన పుట్టిన రోజు వేడుకలకు హాజరయ్యే ప్రతీ అభిమాని ఒక పుస్తకం, మొక్క తీసుకురావాలని ఎమ్మెల్యే కోరారు. ఈ విషయాన్ని తెదేపా నాయకులు, నెహ్రూ అభిమానులు గమనించాలన్నారు.

ఎంపీపీ వేడుకలకు..

గండేపల్లి(జగ్గంపేట): కిర్లంపూడి ఎంపీపీ తోట రవి పుట్టిన రోజు వేడుకలను గురువారం జగ్గంపేటలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, తెదేపా జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ హాజరయ్యి కేక్ కోసి శుభాకాంక్షలు తెలియజేశారు.

వార్డులో కమిషనర్ పర్యటన

ఏలేశ్వరం: పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ నిత్యం పర్యటిస్తున్నామని ఏలేశ్వరం నగర పంచాయతీ కమిషనర్ ఎం.సత్యనారాయణ చెప్పారు. ఈ క్రమంలోనే గురువారం స్థానికంగా ఉన్న 8వ వార్డులో ఆయన తన సిబ్బందితో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ.. పారిశుద్ధ్యం సక్రమ నిర్వహణకు ప్రాధాన్యమిస్తున్నామని ఆయన చెప్పారు. వీధి దీపాలు, తాగు నీరు ఇలా కనీస వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

రెండు సచివాలయాలు ఒకేచోట.. శివారు గ్రామస్థులకు పాట్లు

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ శాఖల సేవలు, సంక్షేమ పథకాల అమలు కోసం గత వైకాపా ప్రభుత్వం గ్రామాల్లో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి భవనాలను నిర్మించారు. ప్రజల సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన ఈ భవనాలు అధికారుల్లో ముందుచూపు కొరవడడంతో శివారుగ్రామాల ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. మండలంలోని రాజపూడిలో ఒకేచోట రెండు సచివాలయ భవనాలు నిర్మించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే గ్రామాన్ని ఆనుకుని సీతారాంపురం, కృష్ణాపురం రెండు శివారు గ్రామాలు ఉన్నాయని ఒక భవనాన్ని మరో చోట నిర్మిస్తే బాగుండేదని ప్రజలు, అధికారులు సైతం చెబుతున్నారు. ఇప్పటికే ఒక భవనం పూర్తికాగా మరో భవనం నిర్మాణంలో ఉంది. రెండు సచివాలయాలకు సంబంధించిన సిబ్బంది ఒకే చోట విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో ప్రజలకు ఏ అవసరం వచ్చినా ఇక్కడికే రావాల్సి ఉంటుందని వాపోతున్నారు.



రాజపూడిలో ఒకేచోట రెండు సచివాలయాల నిర్మాణం

మద్యం దుకాణాల ఏర్పాటులో నిబంధనలు పాటించాలి

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: మద్యం దుకాణాల ఏర్పాటులో పాటదారులు నిబంధనలు పాటించాలని తుని ఎక్సైజ్ సీఐ పట్టాభిచౌదరి తెలిపారు. తుని స్టేషన్ పరిధిలో 22 మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. తుని పట్టణ పరిధిలో 8, తుని మండల పరిధిలో ఆరు, కోటనందూరు మండలంలో రెండు, తొండంగి మండలంలో నాలుగు, రౌతులపూడి మండల పరిధిలో రెండు చొప్పున ప్రభుత్వం అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. మండల పరిధిలో కేటాయించిన దుకాణాలను ఎక్కడైనా పెట్టుకోవచ్చునని తెలిపారు. గుడి, బడికి సుమారు 100 మీటర్ల దూరంలోను, జాతీయ రహదారికి 500 మీటర్ల దూరంలో ఉండాలని ఆయన తెలిపారు.

రేపటి నుంచి రెవెన్యూ గ్రామ సభలు

తొండంగి, న్యూస్‌టుడే: తొండంగి మండలంలో రీ సర్వే జరిగిన పది రెవెన్యూ గ్రామాల్లో ఈ నెల 19 నుంచి నవంబరు 8 వరకు రెవెన్యూ అధికారులు గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దారు మురార్జి తెలిపారు. 19 న ఆనూరు, 22న పైడికొండ, 24న వేమవరం, 26న పీఅగ్రహారం, 28న శృంగవృక్షం, 30 న గోపాలపట్నం నవంబరు 2న ఎ.కొత్తపల్లి, 5న రావికంపాడు, 7న కొమ్మనాపల్లి, 8న పీఈచిన్నాయిపాలెం గ్రామాల్లో రెవెన్యూ గ్రామ సభలు జరుగుతాయన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

గండేపల్లి: తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడి బంగారు నగలు అపహరించారని ఎస్సై శివనాగబాబు తెలిపారు. మండలంలోని బొర్రంపాలెం గ్రామంలో మంగిన వీరవెంకటేశ్వరరావు కుటుంబంతో ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్నారు. గురువారం ఉదయం ఆయన ఇంటి తలుపులు పగలగొట్టి ఉండడంతో స్థానికులు మల్లేపల్లిలో ఉన్న అతని మరదలు వీరలక్ష్మికి సమాచారం ఇచ్చారు. వీరలక్ష్మి వచ్చి చూడగా బీరువాలోని సుమారు రూ.లక్ష విలువ చేసే బంగారు నగలు, దేవుడి గదిలోని రూ.20 వేల నగదును దుండగులు అపహరించినట్లు గుర్తించారు. ఆమె పిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



ఊరేగింపు.. శోభాయమానం

దేవతామూర్తుల వేషధారణలతో గొల్లప్రోలులో గురువారం భారీ ఊరేగింపు నిర్వహించారు. దేవీ నవరాత్రి మహోత్సవాలు ముగిసిన నేపథ్యంలో నిమజ్జనోత్సవంలో భాగంగా స్థానిక సూరంపేటలోని కనకదుర్గ అమ్మవారి ఆలయం నుంచి భారీ సంఖ్యలో ట్రాక్టర్లతో ప్రదర్శన కొనసాగించారు. కనకదుర్గ అమ్మవారి వేషధారణ ప్రత్యేకంగా నిలిచింది. తీన్‌మార్ డప్పు వాయిద్యాలు, నృత్యాలతో ఊరేగింపు నిర్వహించారు. 32 ఏళ్లుగా సూరంపేటలోని కనకదుర్గమ్మ ఆలయంలో దేవీ నవరాత్రి మహోత్సవాల్లో దేవతామూర్తుల వేషధారణలతో ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు.

- న్యూస్‌టుడే, గొల్లప్రోలు

జిల్లా సమాఖ్య, కాకినాడ జిల్లా, కాకినాడ
రిజిస్టర్డ్ నెం. AMC/KKD/DCO/2022/5)
డిఆర్‌డిఏ కార్యాలయ ఆవరణ, ప్రగతి భవనం,
ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి ఎదురుగా, కాకినాడ - 533 001
(email: kakinadadistzs@gmail.com - mobile: 96523 04236)

కాకినాడ జిల్లానందు (1) ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి, కాకినాడ (2) ఏరియా ఆసుపత్రి, తుని మరియు (3) కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ప్రత్తిపాడు నందు జిల్లా సమాఖ్య ఏర్పాటు చేసిన జన ఔషధి జనరిక్ మందుల షాపులను నిర్వహించుకొనుటకు ఆసక్తి కలిగిన గ్రామీణ ప్రాంతాలలోని స్వయం సహాయక సంఘ మహిళల నుండి 25-10-2024 తేదీ లోపున దరఖాస్తులు కోరబడుచున్నవి. దరఖాస్తులు మరియు ఇతర వివరముల కొరకు పై చిరునామా నందలి జిల్లా సమాఖ్య కార్యాలయమును సంప్రదించగలరు.

అధ్యక్షులు
జిల్లా సమాఖ్య, కాకినాడ

IN THE COURT OF THE IV ADDL. DISTRICT JUDGE: KAKINADA
E.P.No.144/2021, ARC No.173/2012
Between:
M/s. Shriram City Union Finance Ltd.
Rep. though G.P.A Holder D.Rammohan, Regional Manager, Zonal Office, Rajahmundry ...Decree Holder
And
1.M.Katama Swamy.
2.G.Roja Rani.
3.G.Vasantha Vani.
4.G.Babu Rao. ...Judgment Debtor

[illegible]

SCHEDULE FILED BY THE DHR
East Godavari District, Kakinada Sub-Registry, Kakinada Urban mandal, Kakinada Municipal Corporation, ward no:27, Block no:49, Jagannadhapuram, Mamidipallivari Street, R.C.C roof building and site bearing D. No:49-5-1/1 with assessment no:1060018663 having 2 items within the following **boundaries: ITEM No.1:** An extent of 136sq.yards of site and in it constructed RCC (G+1) building on the southern side an extent of 68sq.yards bounded on: within this an extent of 68sq.yards and in it constructed RCC building having Ground floor and 1st floor with all fixtures and appurtenant thereto.
EAST: 17 feet property shown in item no:2.
WEST: 17 feet property of others.
NORTH: 36 feet property of Gurram Vasantha Vani.
SOUTH: 36 feet property of Chundru Chidambaram to some extent and property of Balobu to some extent.
ITEM No.2: An extent of 135.33sq.yards of site and in it constructed RCC (G+1) building on the western side an extent of 67.66sq.yards bounded on: within this an extent of 67.66sq.yards of site and in it constructed RCC building having Ground floor and 1st floor with all fixtures and appurtenant thereto. **EAST:** 29 feet property of Gurram Vasantha Vani, **WEST:** 29 feet Item no:1 to some extent and property of Gurram Vasantha Vani to some extent.
NORTH: 21 feet Building of Ismail.
SOUTH: 21 feet property of others.
Both items 1 and 2 comprising a total extent of 135.66sq.yards and in it constructed RCC building having ground floor and 1st floor with all fixtures therein and all easementary rights.
DHR విలువ: రూ.25,00,000
అమీనా విలువ: రూ.33,91,500
మార్కెట్ విలువ: Nil
JDR విలువ: ఇవ్వలేదు

కాకినాడ
17-10-2024

GSMN స్వామి, అడ్వకేట్,
గాంధీ నగర్, కాకినాడ, సెల్: 9866191397, 7013511357

ఆశల పల్లకిలో ఆశావహులు

● సాగునీటి సంఘాలపై నేతల దృష్టి ● అప్పుడే మొదలైన పైరవీలు

న్యూస్‌టుడే, పి.గన్నవరం, ముమ్మిడివరం

గత తెదేపా హయాంలో పంట, మురుగు కాలువలు, సాగు నీటి కట్టడాల నిర్వహణ పనులను సాగు నీటి సంఘాల ప్రతినిధుల పర్యవేక్షణలో నిర్వహించే వారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా అయిదేళ్లపాటు ఈ వ్యవస్థను పక్కన పెట్టేయడంతో రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం సాగు నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. వాస్తవానికి ముందు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 16న ఎన్నికలకు ప్రకటన ఇవ్వాల్సి ఉండగా తుపాను కారణంగా తాత్కాలికంగా వాయిదావేసినట్లు జలవనరులశాఖ అధికారులు చెబుతున్నారు. వర్షాలు తగ్గిన తరువాత ఇవ్వనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఈ పదవులను ఆశించే ఆశావహులు ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. తెదేపా, జనసేన, భాజపా నేతలు పలువురు సాగు నీటి సంఘాలకు ప్రతినిధులు కావాలని ఉవ్విళ్లూరుతున్నారు.

సాగు నీటి సంఘాల ఎన్నికలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో టీసీల వారీ ఓటర్ల జాబితాలు తయారు చేసే పనిలో రెవెన్యూ యంత్రాంగం నిమగ్నమైంది. జలవనరులశాఖ వద్ద గతంలో ఉన్న రికార్డుల మేరకు టీసీల వారీ ఆయకట్టు, సర్వే నంబర్లవారీ రైతుల వివరాలను ఆ శాఖ అధికారులు ఇప్పటికే రెవెన్యూ శాఖ అధికారులకు అందజేశారు. గతంలో ఉన్న సాగు భూములు ఇళ్ల స్థలాలు, ఇతర కట్టడాలుగా మారాయి. అలాంటి వాటిని ఓటర్ల జాబితానుంచి తొలగిస్తారు. ప్రస్తుతం వాస్తవంగా ఉన్న ఓటర్ల(రైతులు)తో తాజాగా ఓటర్ల జాబితాలను రూపొందిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా

గోదావరి డెల్టా సిస్టమ్ పరిధిలో 144 సాగునీటి వినియోగదారుల సంఘాలు, 25 నీటి పంపిణీ కమిటీలు, ఒక ప్రాజెక్టు కమిటీ ఉన్నాయి. ● ఏలేరు రిజర్వాయర్ ప్రాజెక్టు పరిధిలో 25 సాగునీటి సంఘాలు, అయిదు నీటి పంపిణీ కమిటీలు, ఒక ప్రాజెక్టు కమిటీ ● తొర్రిగడ్డ పంపింగ్ స్కీములో నాలుగు సాగు నీటి సంఘాలు, ఒక ప్రాజెక్టు కమిటీ ● పంపా రిజర్వాయర్ ప్రాజెక్టులో ఆరు సాగు నీటి సంఘాలు, ఒక ప్రాజెక్టు కమిటీ ● సుబ్బారెడ్డిసాగర్ ప్రాజెక్టులో ఆరు సాగునీటి సంఘాలు, ఒక ప్రాజెక్టు కమిటీ ● మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పరిధిలో 216 సాగు నీటి సంఘాలు ఉన్నాయి.



పి.గన్నవరం డొక్కా సీతమ్మ అక్విడక్టు

తమ స్థాయిని బట్టి..

● నాయకులు తమ స్థాయినిబట్టి అధ్యక్షులు, నీటి పంపిణీ కమిటీ ఛైర్మన్ల పదవులను కొందరు, ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్లు కావాలని మరికొందరు ఆశిస్తున్నారు. పి.గన్నవరం మండలంలో ఒక సాగు నీటి సంఘానికి సంబంధించి ఇద్దరు గట్టిగా పోటీపడుతున్నారు. ఇద్దరిలో ఒకరు పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఒక ఎమ్మెల్యే ద్వారా కోనసీమలోని ఒక ఎమ్మెల్యేకి అప్పుడే సిఫార్సు చేయించినట్లు సమాచారం. గతంలో పని చేసిన సాగు నీటి సంఘాల ప్రతినిధులు ఎక్కువగా మళ్లీ ఈ పదవులను ఆశిస్తున్నారు. కొందరైతే నేరుగా జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వద్దకు వెళ్లి బయోడేటాలు ఇస్తున్నట్లు తెలిసింది. ప్రధానంగా ముందుగా టీసీ మెంబరు కావాలి. ఇందుకోసం టెరిటోరియల్ కానిస్టెన్సీ పరిధిలోని ఓటరైన రైతులను కూడా ఆశావహులు కలిసి తమకు సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

గతంలోని కమిటీలన్నింటికీ...

సాగునీటి సంఘాలకు సంబంధించి ఓటర్ల జాబితాలు తయారు చేస్తున్నారు. దాదాపుగా గతంలో ఉన్న కమిటీలకు ఎన్నికలు జరుగుతాయి. నోటిఫికేషన్ వాయిదా పడటంతో షెడ్యూల్‌లో కూడా మార్పులు ఉంటాయి.

- ఎన్.పుల్లారావు, చీఫ్ ఇంజినీర్, గోదావరి డెల్టా సిస్టమ్

గిరి ప్రదక్షిణ ఏర్పాట్ల పరిశీలన

అన్నవరం, న్యూస్‌టుడే : పవిత్ర కార్తిక మాసంలో నవంబరు 15న జరగనున్న అన్నవరం సత్యదేవుని గిరి ప్రదక్షిణ ఏర్పాట్లను అధికారుల బృందం గురువారం పరిశీలించారు. ఇంజినీరింగ్, వివిధ విభాగాల అధికారుల బృందం గిరిప్రదక్షిణ జరిగే మార్గంలో భక్తులకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. రోడ్డును శుభ్రం చేయడం, ఎండు గడ్డి వేయడం, తాగునీరు, పండ్లు, ఇతర ఆహార పదార్థాలు, ప్రసాదం పంపిణీకి స్టాల్స్, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు తదితరాలను పరిశీలించారు. ● దేవస్థానంలో గురువారం రద్దీ నెలకొంది. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. నూతన వధూవరుల సందడి కనిపించింది. కొండపైన, వివిధ ప్రాంతాల్లో వివాహాలు చేసుకున్న నూతన వధూవరులు పెద్దసంఖ్యలో వచ్చి వ్రతమాచరించి, స్వామిని దర్శించుకున్నారు. పౌర్ణమి సందర్భంగా వనదుర్గ అమ్మవారి ఆలయంలో ప్రత్యంగిర హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు.



మార్గాన్ని పరిశీలిస్తున్న ఆలయ అధికారులు

నర్సుల ఎన్నికల్లో ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఏకగ్రీవం

మసీదు సెంటర్(కాకినాడ): ఏపీ ప్రభుత్వ నర్సెస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా సంఘ ఎన్నికలకు సంబంధించి మొత్తం 17 నామపత్రాలు దాఖలయ్యాయి. వాటిని పరిశీలించగా, ఒకటి సరిగా లేకపోవడంతో తిరస్కరణకు గురైనట్లు ఎన్నికల అధికారి టి.నందన గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మిగిలిన 16 సక్రమంగా ఉన్నాయన్నారు. ఎగ్జిక్యూటివ్ సభ్యుల పదవులకు వచ్చిన ఆరు నామపత్రాల్లో ఒకటి తిరస్కరణకు గురవ్వడంతో అయిదు మాత్రమే మిగలడంతో ఏకగ్రీవం అయ్యాయని ప్రకటించారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి పదవులకు 23న ఎన్నికలు జరుగుతాయన్నారు. 18 సాయంత్రం 5 గంటల వరకూ నామపత్రాల ఉపసంహరణకు గడువు ఉందన్నారు.

నవోదయ 9, 11 తరగతుల్లో చేరేందుకు అవకాశం

పెద్దాపురం: పెద్దాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న 9, 11వ తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వైస్ ప్రిన్సిపల్ రామకృష్ణయ్య గురువారం తెలిపారు. కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన విద్యార్థులు అవకాశం వినియోగించుకోవచ్చన్నారు. దరఖాస్తులను నవోదయ వెబ్‌సైట్ ద్వారా చేసుకోవాలన్నారు.

పశువుల ఆరోగ్య రక్షణకు చర్యలు

కాకినాడ కలెక్టరేట్: కాకినాడలోని జంతు హింస నివారణ సంఘం(ఎస్‌పీసీఏ) ఆధ్వర్యంలోని పశువుల పోషణ, ఆరోగ్య రక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో మున్సిపల్, రెవెన్యూ, పశుసంవర్ధకశాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. ఆశ్రమ ఆవరణ చిత్తడిగా ఉందని, పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎస్‌పీసీఏ నిర్వహణపై పరిశీలనాధికారిగా సంయుక్త కలెక్టర్ రాహుల్ మీనాను నియమించినట్లు తెలిపారు. ఈనెల 24లోగా నివేదిక ఇవ్వాలన్నారు. ఎస్‌పీసీఏ ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నాఉ. దుకాణాల అద్దెలు సక్రమంగా వసూలు చేయాలన్నారు. కాకినాడ మున్సిపల్ కమిషనర్ భావన, ఉప కమిషనర్ ఎస్.మనోహర్, ఎంహెచ్‌వో డి.పృధ్వీచరణ్, పశుసంవర్ధకశాఖ జేడీ ఎస్.సూర్యప్రకాశరావు, తహసీల్దారు వి.జితేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక విధానాలపై కార్మిక సంఘాలతో చర్చించాలి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

గాంధీనగర్, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబునాయుడు నూతనంగా ప్రవేశపెడుతున్న పారిశ్రామిక విధానాలపై కార్మిక సంఘాలతో చర్చించిన తర్వాతే తుది రూపు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. గురువారం కచేరిపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రగతే ముఖ్యమని కొత్తగా ఆరు పాలసీలు ప్రకటించారని, ఇప్పటి వరకు ఉన్న మూడు పారిశ్రామిక విధానాలు, వాటి ప్రగతి గురించి చెప్పలేదన్నారు. ఎన్నికల ముందు జగన్‌మోహన్‌రెడ్డి రూ.24 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయన్నారు, ఇపుడు చంద్రబాబు రూ.30 లక్షల కోట్లు అంటున్నారన్నారు. 20 లక్షల ఉద్యోగాలు పక్కన పెడితే ఇప్పటివరకు ఎన్ని ఉద్యోగాలు కల్పించారో చెప్పాలన్నారు. ఇంటికో పారిశ్రామికవేత్త ఆలోచన బాగున్నా వ్యవసాయం సంగతేంటన్నారు. కేంద్రం గోధుమ, ఇతర పంటలకు గిట్టుబాటు ధర కల్పించిందని, రాష్ట్రంలో ప్రధానంగా పండే వరి పంటకు ఎందుకు ధర పెంచలేదన్నారు. గతంలో ప్రధాని మోదీ చేతిలో జగన్‌మోహన్‌రెడ్డి కీలుబొమ్మగా ఉంటే నేడు చంద్రబాబు అలాగే వ్యవహరిస్తున్నారన్నారు. జిల్లాలో పదివేల మంది మత్స్యకారులకు వేట నిషేధ పరిహారం అందలేదన్నారు. వచ్చేనెల 8 నుంచి 15 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాపోరు పేరుతో నిరసనలు చేపడతామన్నారు. మద్యం దుకాణాలు ఎక్కడ పడితే అక్కడ పెట్టకుండా స్థానికుల అభిప్రాయం తీసుకోవాలన్నారు. సీపీఎం నాయకులు ఏవి నాగేశ్వరరావు, జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, దువ్వా శేషబాబ్జి, కేఎస్.శ్రీనివాసు, కె.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

జె.తిమ్మాపురానికి రూ.25 లక్షలతో ఆర్వో ప్లాంటు

పెద్దాపురం, న్యూస్‌టుడే: పెద్దాపురం మండలంలోని జె.తిమ్మాపురం గ్రామస్థులు స్వచ్ఛమైన నీరు తాగేందుకు నెక్కంటి సీఫుడ్స్ కంపెనీ ఎండీ నెక్కంటి వెంకట్రావు రూ.25 లక్షల విలువైన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను బుధవారం బహూకరించారు. ప్లాంట్‌ను అమెరికా నుంచి వచ్చిన మీజర్ రిటైల్ సూపర్ మార్కెట్, ఈస్టర్న్ ఫిష్ కంపెనీకి చెందిన ప్రతినిధులు ప్రారంభించారు. గతంలో నెక్కంటి సీఫుడ్స్ సంస్థ పరిసర గ్రామాల్లో రోగులకు విశ్రాంత హాలు, రెండు వైద్యుల ఛాంబర్లు, గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు భోజనశాల, డిజిటల్ తరగతి గది ఏర్పాటు చేసింది. సేవలను పలువురు ప్రశంసించారు. కంపెనీ అడ్మినిస్ట్రేషన్ మేనేజర్ గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.



నెక్కంటి సీఫుడ్స్ ఇచ్చిన ప్లాంటును ప్రారంభిస్తున్న అమెరికా ప్రతినిధులు

అగ్ని ప్రమాదం

ఏలేశ్వరం: తిరుమాలిశివారు కాలనీలో జరిగిన అగ్ని ప్రమాదంలో బాషా అనే వ్యవసాయ కూలీకి చెందిన తాటాకుల ఇల్లు విద్యుదాఘాతంతో బుధవారం అర్ధరాత్రి దగ్ధమైంది. ఇంట్లో బాషా,భార్య వెంకటక్ష్మి, కుమారుడు బషీర్ నివసిస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నారు.

తుని పట్టణాన్ని అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే

తుని పట్టణం: పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. ఉప్పరిగూడెం కొత్తకాలనీలో కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కూడా) నిధులు రూ.80 లక్షలతో నిర్మించనున్న ఆరు సీసీ రోడ్లకు గురువారం శంకుస్థాపన చేశారు. ఆమె మాట్లాడుతూ.. దశల వారీగా పట్టణంలోని అన్ని ప్రాంతాల్లోను ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించి మెరుగు పరుస్తామన్నారు. నాయకులు యినుగంటి సత్యనారాయణ, మళ్ల గణేష్, బాలాజీ, సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే దివ్య

గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యం

తుని గ్రామీణం: కూటమి ప్రభుత్వంలో గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే దివ్య తెలిపారు. 'పల్లె పండగ'లో భాగంగా రేఖవానిపాలెం, మరువాడ, కోటనందూరు మండలంలోని జగన్నాథపురం, కోటనందూరు గ్రామాల్లో సుమారు రూ.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రహదారులకు భూమిపూజ చేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తొండంగి: కొత్తపాకలు గ్రామంలో దివీస్ ఫార్మా సంస్థ నిర్మిస్తున్న సీసీ రహదారులకు ఎమ్మెల్యే దివ్య శంకుస్థాపన చేశారు. తాటియాకులపాలెం, కొత్తపాకలు, ఒంటిమామిడి గ్రామాల్లో సుమారు రూ.మూడు కోట్లతో సీసీ రోడ్లు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రహరీ ఏర్పాటు మంచి పరిణామమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నాయకులు యనమల రాజేష్, కొయ్యా కేశవ, చొక్కా కాశి, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

ఏలేశ్వరం, తుని గ్రామీణం, న్యూస్‌టుడే: వాల్మీకి మహర్షి జయంతిని గురువారం ఏలేశ్వరం నగర పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. ఛైర్‌పర్సన్ అలమండ సత్యవతి ముందుగా వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కమిషనర్ సత్యనారాయణ, కౌన్సిలర్ చలమయ్య, నాయకులు పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఛైర్‌పర్సన్ సత్యవతి

● వి.కొత్తూరు గిరిజన ఆశ్రమ పాఠశాల, ఎంపీడీవో, తహసీల్దారు కార్యాలయాల్లో పలువురు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గిరిజన ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం విజయకుమారి విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అర్చన.. పారాయణ

ప్రత్తిపాడు, రౌతులపూడి, న్యూస్‌టుడే: రాచపల్లిలో శ్రీఅపీత కుచాంబ అరుణాచలేశ్వరస్వామి క్షేత్రంలో గురువారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారి ఆలయంలో అర్చనల అనంతరం సత్సంగ మహిళలు లలితాసహస్రం, మణిద్వీప వర్ణన పారాయణ చేశారు. శ్రీరమణ సేవాశ్రమం పీఠాధిపతి స్వామి రామానంద ప్రసంగించారు. ★ రౌతులపూడి దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక పౌర్ణమి హారతిలో మహిళలు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



రౌతులపూడి: పౌర్ణమి హారతిలో మహిళలు


మూలకు చేరిన చెత్త సేకరణ రిక్షాలు



గ్రామాల్లో ఇళ్ల నుంచి చెత్తను సేకరించేందుకు కొనుగోలు చేసిన ట్రైసైకిళ్లు తుప్పు పట్టి మూలకు చేరాయి. రూ.వేలు వెచ్చించి కొనుగోలు చేసిన వీటి నిర్వహణ లేకపోవడంతో రోడ్లపక్కన, కార్యాలయాల పక్కన మూలకు చేరుతున్నాయి. పలు గ్రామాల్లో ఇవి మూలకు చేర్చిన పరిస్థితి కనిపిస్తుంది. మామిడాడ, ఇర్రిపాక, జె.కొత్తూరు, రాజపూడి, గొల్లలగుంట, కాట్రావులపల్లి తదితర గ్రామాల్లో వీటి నిర్వహణ లేక మూలకు చేర్చడంతో తుప్పుపట్టి ఉన్నాయి.

-న్యూస్‌టుడే, జగ్గంపేట గ్రామీణం

నింగిలో వెన్నెల.. నేలపై వెలిగిందిలా..



రౌతులపూడి మండలం కొండల మధ్య ఉన్న ములగపూడి. చుట్టూ కొండలు.. పైన ఆకాశమే ఈ పల్లె హద్దులు. పురాతన ఆలయం ఉన్న శ్రీరామగిరి నుంచి చూస్తే పౌర్ణమి వేళ ములగపూడి కనుల పంట అయింది. ఉపప్రణాళికా మన్యంలో ప్రకృతి అందాలకు తోడు ఉన్నంతలో ఆధునికంగా, సాంకేతికంగా ఎదుగుతున్న గ్రామం... సూర్యుని వెలుగులోనూ సందర్శనీయమే.

- న్యూస్‌టుడే, రౌతులపూడి

ఉద్యోగమేళా వాయిదా

తుని: వికాస ఆధ్వర్యంలో శుక్రవారం జరగాల్సిన ఉద్యోగమేళా వాయిదా పడింది. పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాల ఆవరణలో ఉద్యోగ మేళా నిర్వహించాలని భావించినా ప్రస్తుత వర్షాల దృష్ట్యా తాత్కాలికంగా వాయిదా వేశామని, మళ్లీ తేదీ ప్రకటిస్తామని సిబ్బంది స్పష్టం చేశారు.

దోమల నివారణకు చర్యలు

శంఖవరం: మండపం గ్రామంలోని పంచాయతీ వీధిలో మురుగు, చెత్త పేరుకుపోయి దుర్వాసన, దోమలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా ఆయన సిబ్బందితో మురుగు, చెత్త శుభ్రం చేయించి దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూIIలలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	11,500
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	13,000-13,500
కొత్త (పచ్చి) కాయ	12,500-13,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూIIలో

ఫారంరేటు	130-00
రిటైల్ లైవ్	152-00
డ్రెస్డ్	220-00
స్కిన్‌లెస్	251-00

గుంత.. ప్రమాదాలతో చింత



కొండేవాని చెరువు వద్ద గుంత

కిర్లంపూడి, న్యూస్‌టుడే: కల్వర్టు పాడవ్వడంతో రోడ్డుకు మధ్యలో పెద్ద గుంత ఏర్పడి వాహన చోదకులకు ఇబ్బందిగా మారింది. దీంతో ప్రమాదాల బారిన పడుతున్నామని వారు వాపోతున్నారు. జగపతినగరం పరిధిలోని కొండేవాని చెరువు నీరు బయటకు వెళ్లే కల్వర్టు వద్ద ఈ సమస్య చోటుచేసుకుంది. సామర్లకోట ప్రత్తిపాడు ప్రధాన ర.భ. రోడ్డులో ఇటీవల అర్ధరాత్రి సమయంలో భార్యాభర్తలు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఈ గుంతలో వాహనం పడిపోవడంతో మహిళకు తీవ్రగాయాలయ్యాయి. జగపతినగరం నుంచి ప్రత్తిపాడు వరకు ఉన్న ప్రధాన రహదారి మొత్తం గుంతలతోనే దర్శనమిస్తోంది. సంబంధిత ర.భ.అధికారులు స్పందించి ఈ ప్రదేశంలో కనీస రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

గండేపల్లి: 14.5 కేజీల గంజాయిని తరలిస్తున్న ఇద్దరు యువకులను పట్టుకున్నట్లు ఎస్సై శివనాగబాబు తెలిపారు. ఎన్‌హెచ్‌పై గురువారం వాహనాలు తనిఖీ చేపట్టారు. జగ్గంపేట నుంచి రాజమహేంద్రవరం వైపు ద్విచక్రవాహనంపై పల్నాడుజిల్లా చిలకలూరిపేటకు చెందిన కేతవత్ స్వామినాయక్, మామిళ్లపల్లి బాల గణేష్‌లు గంజాయితో వెళుతున్నారు. వీరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దీని విలువ సుమారు రూ.72,500 ఉంటుందని ఎస్సై పేర్కొన్నారు. డిప్యూటీ తహసీల్దారు దివ్యభారతి, సిబ్బంది పాల్గొన్నారు.